


# పెన్ పవర్

తెలుగు దిన పత్రిక

ప్రశ్నించడం మన హక్కు




సంపుటి : 1 సంచిక : 77 పేజీలు :8 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : ఎన్.టి.ఆర్ జిల్లా మంగళవారం 31 మార్చి 2026 వెల : 5/-రూ ॥

VOLUME :1 ISSUE : 77 PAGES :8 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : NTR DIST, TUE 31 MARCH 2026 PRICE : 5/- RS

Simultaneously Published form Tirupati, Chittoor,Srikakulam,Ongole,Visakhapatnam,Kakinada,West Godavari,Bapatla,Narasarao Peta, Ongole, SPSR Nellore, Tirupati, YSR Kadapa,Circulated by : manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur,Kurnool,Anantapur

## రూ.404 కోట్ల ఆస్తులు, ఖరీదైన కార్లు అఫిడవిట్‌లో పేర్కొన్న విజయ్

- తన వద్ద రూ.2 లక్షలు, భార్య వద్ద రూ.1 లక్ష నగదు రూపంలో ఉన్నట్లు వెల్లడి
- బీఎండబ్ల్యూ, టయోటా కార్లు ఉన్నట్లు తెలిపిన విజయ్
- రూ.1.20 కోట్ల విలువైన బంగారం ఉందని పేర్కొన్న విజయ్

- మిగతా2లో



## లాకర్లలోని వస్తువులను బ్యాంకులు చూడవు, రికార్డు చేయవు

- వస్తువులను చూడటం బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘన అవుతుందన్న మంత్రి
- లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లు పరిహారాన్ని బ్యాంకులు చెల్లిస్తున్నట్లు వెల్లడి
- లాకర్లలోని వస్తువులను విలువ ఆధారంగా పరిహారం చెల్లించడం కుదరదని వెల్లడి

పెన్ పవర్ డెస్క్:వినియోగదారులు లాకర్లలో ఉంచే విలువైన వస్తువులను బ్యాంకులు చూడలేవని కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. వాటిని చూడటం లేదా రికార్డు చేయడం బ్యాంకింగ్ నిబంధనల ఉల్లంఘన కిందకు వస్తుందని అన్నారు. బ్యాంకు లాకర్లలో

- మిగతా2లో



## కొల్లు రవీంద్ర ఏజెంట్లకు రెవెన్యూ యంత్రాంగం తొత్తుగా మారింది



- సన్నకారు రైతులను కూటమి ప్రభుత్వం దోచుకుంటోందన్న పేర్ని నాని
- బోరు వేయాలన్నా రూ. 50 వేలు వసూలు చేస్తున్నారని ఆరోపణ
- బాధితుల పక్షాన పోరాడతామని వ్యాఖ్య

పెన్ పవర్ డెస్క్:బందరు రెవెన్యూ డివిజన్ పరిధిలో సన్నకారు రైతులను కూటమి ప్రభుత్వం దోచుకుంటోందని

- మిగతా2లో

## తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ

- తిరుమలలో కాస్త తగ్గిన భక్తుల తాకిడి
- శ్రీవారి సర్వదర్శనానికి 8 గంటల సమయం
- 10 కంపార్ట్‌మెంట్లలో వేచి ఉన్న భక్తులు
- ఆదివారం శ్రీవారిని దర్శించుకున్న 80,774 మంది
- రూ. 4.05 కోట్లుగా నమోదైన హుండీ ఆదాయం



- మిగతా2లో

## పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- టీడీపీ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పవన్
- సోషల్ మీడియా ద్వారా స్పందించిన చంద్రబాబు
- కూటమి ఐక్యతకు పవన్ అందిస్తున్న సహకారం అభినందనీయమన్న సీఎం
- గత 20 నెలల పాలనే మన ఐక్యతకు నిదర్శనమని వ్యాఖ్య
- కూటమి ఐక్యతా స్ఫూర్తి పదికాలాలు కొనసాగాలని ఆకాంక్ష



పెన్ పవర్ డెస్క్:తెలుగుదేశం పార్టీ 44వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు తెలిపిన ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం కూటమి పక్షాల ఐక్యతకు పవన్ అందిస్తున్న సహకారం ఎంతో అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ సందర్భంగా చంద్రబాబు సోషల్ మీడియాలో స్పందిస్తూ., "రాష్ట్ర అభివృద్ధి,

- మిగతా2లో



## తిరుపతిలో వెయ్యి కోట్ల భూదందా..

### సూత్రధారి, పాత్రధారి నారా లోకేశ్

- తిరుపతి నడిబొడ్డున ఉన్న 22 ఎకరాల భూమిని రూ. 94 కోట్లకే అప్పగించారన్న భూమన
- బహిరంగ ప్రకటన కూడా లేకుండానే భూమిని దోచిపెట్టారని మండిపాటు
- వందల కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆరోపణ

పెన్ పవర్ డెస్క్:తిరుపతిలో సుమారు వెయ్యి కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూములను కూటమి ప్రభుత్వం కారుచౌకగా ప్రైవేటు సంస్థలకు కట్టబెడుతోందని టీటీడీ మాజీ చైర్మన్, వైసీపీ నేత భూమన కరుణాకర్ రెడ్డి మండిపడ్డారు. ఈ మొత్తం వ్యవహారానికి మంత్రి నారా లోకేశ్ సూత్రధారి,

- మిగతా2లో

## డిసెంబర్‌లోపు మరో 4.50 లక్షల ఇళ్లు ఇస్తాం

- నాయుడుపేటలో ఇళ్ల పంపిణీ... ఓ ఇంటికి గుమ్మడికాయ కట్టిన సీఎం చంద్రబాబు...
- రాష్ట్రవ్యాప్తంగా 2.5 లక్షల ఇళ్ల సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం
- నాయుడుపేటలో లబ్ధిదారులతో కలిసి ఇళ్లలోకి ప్రవేశించిన సీఎం చంద్రబాబు
- హిందూ లబ్ధిదారు ఇంటిలో సత్యనారాయణ వ్రతంలో పాల్గొన్న ముఖ్యమంత్రి
- ముస్లిం కుటుంబంతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసిన చంద్రబాబు
- కార్యక్రమంలో మంత్రులు, ఎమ్మెల్యే, ఉన్నతాధికారులు పాల్గొన్నారు





పెన్ పవర్ డెస్క్:రాష్ట్రవ్యాప్తంగా పేదల సొంతింటి కలను సాకారం చేస్తూ ప్రభుత్వం చేపట్టిన 2.5 లక్షల టిడ్కో ఇళ్ల సామూహిక గృహప్రవేశాల కార్యక్రమం సోమవారం పండుగ వాతావరణంలో జరిగింది. తిరుపతి జిల్లా, సూళ్లూరుపేట నియోజకవర్గంలోని నాయుడుపేటలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వయంగా పాల్గొని ఈ బృహత్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన లబ్ధిదారులతో కలిసి వారి కొత్త ఇళ్లలోకి ప్రవేశించి శుభాకాంక్షలు తెలిపారు.ముందుగా ముఖ్యమంత్రి, లబ్ధిదారురాలైన ముక్కర అంబిక ఇంటికి వెళ్లి గృహప్రవేశ వేడుకలో పాల్గొన్నారు. వారి కుటుంబ సభ్యులు ఏర్పాటు చేసిన సత్యనారాయణ స్వామి వ్రతంలో కూర్చుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం, మరో లబ్ధిదారురాలైన షేక్ నూరి ఇంటికి వెళ్లారు. అక్కడ వారి సంప్రదాయం ప్రకారం జరిగిన గృహప్రవేశ కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. నూరి కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు చేసి, వారిని ఆశీర్వదించారు.ఒకే వేదికపై హిందూ, ముస్లిం లబ్ధిదారుల ఇళ్లలో జరిగిన వేడుకల్లో ముఖ్యమంత్రి పాల్గొనడం

- మిగతా2లో

## ఏపీ పోలీసుల ముందు లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత

- పోలీసుల ముందు లొంగిపోయిన మావో నేత చెల్లూరు నారాయణరావు అలియాస్ సోమన్న
- ఏవోబీ ప్రాంతంలో దశాబ్దాల పాటు ఆయనది కీలక పాత్ర
- మావోయిస్టుల లొంగుబాటుకు రేపటితో ముగుస్తున్న డెడ్ లైన్

పెన్ పవర్ డెస్క్: దేశవ్యాప్తంగా మావోయిజం నిర్మూలనే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతున్న వేళ, మావోయిస్టు పార్టీకి మరో భారీ ఎదురుదెబ్బ తగిలింది. ఆంధ్రా-ఒడిశా బోర్డర్ రాష్ట్ర కమిటీ సభ్యుడిగా, పార్టీలో కీలక వ్యూహకర్తగా ఉన్న చెల్లూరు నారాయణరావు

- మిగతా2లో



## ఎల్డీఎఫ్-బీజేపీల మధ్య రహస్య ఒప్పందం ఉంది: కేరళలో రాహుల్ గాంధీ విమర్శలు

- కేరళ ఎన్నికల ప్రచారంలో రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు
- పాలక్కాడ్ పర్యటనలో శబరిమల అంశంపై మోదీ ఎందుకు మాట్లాడలేదన్న రాహుల్
- అవినీతి ఆరోపణలు ఉన్న విజయన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్న

- మిగతా2లో



## హార్మూజ్ తెరవకపోతే ఖర్గ్ దీవిని నాశనం చేస్తాం

### ఇరాన్ కు ట్రంప్ తాజా వార్నింగ్

- హార్మూజ్ జలసంధిని తెరవకపోతే తీవ్ర పరిణామాలుంటాయని ఇరాన్‌కు ట్రంప్ హెచ్చరిక
- ఖర్గ్ దీవి సహా కీలక చమురు, విద్యుత్ కేంద్రాలను ధ్వంసం చేస్తామని అల్టిమేటం
- చర్చల్లో పురోగతి ఉందని చెబుతున్న ట్రంప్.. అలాంటివేమీ లేవంటున్న ఇరాన్
- మధ్యప్రాచ్యంలో అమెరికా సైనిక మోహరింపుతో పెరుగుతున్న ఉద్రిక్తతలు

- మిగతా2లో



## ఎయిర్‌పోర్టుల్లో చౌక ధరలకే ఫుడ్.. రూ.10కే టీ, రూ.20కే స్నాక్స్

- దేశవ్యాప్తంగా మరో 11 విమానాశ్రయాల్లో ఉడాన్ యాత్రి కేఫ్‌లు ప్రారంభం
- కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు చేతుల మీదుగా వర్చువల్ ప్రారంభోత్సవం
- ఈ కేఫ్‌లలో రూ.10కే టీ, వాటర్ బాటిల్, రూ.20కే స్నాక్స్
- స్థానిక రుచులకు ప్రాధాన్యత.. ప్రయాణికుల నుంచి ప్రశంసలు



పెన్ పవర్ డెస్క్:విమాన ప్రయాణికులకు కేంద్ర ప్రభుత్వం మరో శుభవార్త అందించింది. విమానాశ్రయాల్లో అధిక ధరలకు చెక్ పెడుతూ, ప్రయాణికులకు నాణ్యమైన ఆహారాన్ని అత్యంత చౌక ధరలకే అందించేందుకు

- మిగతా2లో

## ఎడిటర్ వ్యూ

# దక్షిణ భారతంపై ఢిల్లీ పెత్తనం

భారతదేశం అనేది రాష్ట్రాల కలయికతో ఏర్పడిన ఒక సమాఖ్య. కానీ, నేడు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి-ఆర్ఎస్ఎస్ కూటమి ఆ సమాఖ్య పునాదులను పెకిలించి, దేశాన్ని ఒకే రంగు, ఒకే భాష, ఒకే అధికార కేంద్రం కిందకు తెచ్చేందుకు ప్రమాదకరమైన వ్యూహాలను అమలు చేస్తోంది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇటీవల లేవనెత్తిన అంశాలు కేవలం రాజకీయ విమర్శలు కావు; అవి దక్షిణాది అస్తిత్వంపై జరుగుతున్న దాడికి వ్యతిరేకంగా వినిపించిన హెచ్చరికలు. ఆర్థికంగా దోపిడీ చేస్తూ, రాజకీయంగా గొంతు నొక్కే ఈ 'నయా సామ్రాజ్యవాద' ధోరణిని దక్షిణాదిలోని ప్రజాస్వామిక, లౌకిక శక్తులు ఐక్యంగా ఎదిరించాల్సిన చారిత్రక అవసరం ఏర్పడింది. దక్షిణాది రాష్ట్రాలు-తమిళనాడు, కేరళ, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ-దేశ అభ్యున్నతిలో కీలక పాత్ర పోషిస్తున్నాయి. దేశ భౌగోళిక విస్తీర్ణంలో కేవలం 20 శాతం, జనాభాలో 19 శాతం ఉన్న దక్షిణాది రాష్ట్రాలు, దేశ జీడీపీలో ఏకంగా 30 శాతం పైగా వాటాను అందిస్తున్నాయి. అయితే, కేంద్ర పన్నుల పంపిణీలో మనకు జరుగుతున్న అన్యాయం విస్మయానికి గురి చేస్తోంది.

కర్ణాటక కేంద్రానికి రూపాయి పన్ను చెల్లిస్తే, తిరిగి పొందుతున్నది కేవలం 15 పైసలు మాత్రమే. తమిళనాడు చెల్లించే ప్రతి రూపాయికి 29 పైసలు మాత్రమే తిరిగి వస్తున్నాయి. తెలంగాణ రూపాయికి దాదాపు 40 పైసల లోపే వాటా దక్కుతోంది. ఉత్తరప్రదేశ్, బీహార్ దీనికి భిన్నంగా, ఉత్తరప్రదేశ్ ఒక రూపాయి చెల్లిస్తే దాదాపు 2.70 రూపాయలు, బీహార్ ఏకంగా 7 రూపాయలకు పైగా తిరిగి పొందుతున్నాయి. అభివృద్ధి చెందినందుకు, జనాభా నియంత్రణ పాటించినందుకు దక్షిణాది రాష్ట్రాలకు శిక్ష వేయడం ఏ రకమైన న్యాయం దక్షిణాది కార్మికుల చెమట, ఐటీ నిపుణుల మేధస్సుతో వస్తున్న సంపదను ఉత్తరాదిలోని బీజేపీ ఓటు బ్యాంకును కాపాడుకోవడానికి మళ్లించడం ఒక రకమైన 'ఆర్థిక వలసవాదం' కాక మరేమిటి? 2026 తర్వాత జరగబోయే లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజన దక్షిణాది రాజకీయ అస్తిత్వాన్ని నాశనం చేసేలా ఉంది. జనాభా ప్రాతిపదికన సీట్లు పెంచితే, జనాభాను నియంత్రించిన దక్షిణాది రాష్ట్రాల సీట్ల సంఖ్య తగ్గుతుంది లేదా స్థిరంగా ఉంటుంది. అదే సమయంలో, జనాభా విస్ఫోటనం జరిగిన హిందీ రాష్ట్రాల్లో సీట్ల సంఖ్య భారీగా పెరుగుతుంది. దీనివల్ల ఢిల్లీ పీఠాన్ని అధిరోహించడానికి దక్షిణాది మద్దతు అవసరం లేని పరిస్థితి ఏర్పడుతుంది. పార్లమెంటులో దక్షిణాది గళం బలహీనపడి, మన ప్రాంతీయ ప్రయోజనాలు పూర్తిగా విస్మరించబడతాయి. ఇది ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమే. బాధ్యతాయుతంగా వ్యవహరించిన రాష్ట్రాలను శిక్షించి, బాధ్యతారాహిత్యంగా ఉన్న ప్రాంతాలకు రాజకీయ అధికారం కట్టబెట్టడం 'ఆర్ఎస్ఎస్' మార్క్ అఖండ భారత వ్యూహంలో భాగం.

బిజెపి-ఆర్ఎస్ఎస్ కూటమి కేవలం నిధులను మాత్రమే దోచుకోవడం లేదు; మన సంస్కృతిని, భాషను కూడా అణగదొక్కాలని చూస్తోంది. 'హిందీ-హిందూ-హిందుస్థాన్' అనే నినాదంతో దక్షిణాదిలోని విభిన్న భాషా అస్తిత్వాలను తుడిచివేయాలని చూస్తున్నారు. కేరళలో లౌకికవాదాన్ని, తమిళనాడులో ద్రవిడ ఆత్మగౌరవాన్ని, తెలుగు రాష్ట్రాల్లోని ప్రజాస్వామిక సంస్కృతిని విచ్ఛిన్నం చేసేందుకు మతపరమైన చిచ్చు పెడుతున్నారు. దక్షిణాదిలోని కేరళ, తమిళనాడు, తెలంగాణ వంటి రాష్ట్రాలు నేటికీ సెక్యులర్ విలువలకి కంచుకోటలు. అందుకే ఈ రాష్ట్రాలపై కేంద్రం కక్షపూరితంగా వ్యవహరిస్తోంది. సీఎం రేవంత్ రెడ్డి లేవనెత్తిన నిధుల అంశం, స్టాలిన్ వినిపిస్తున్న భాషా హక్కుల గళం, పినరయి విజయన్ సాగిస్తున్న ఫెడరలిజం పోరాటం.. ఇవన్నీ ఇప్పుడు ఒకే వేదికపైకి రావాలి. రాజకీయ విభేదాలను పక్కన పెట్టి దక్షిణాది ముఖ్యమంత్రులందరూ ఒకే గొంతుతో ఢిల్లీని నిలదీయాలి. ఇది కేవలం పాలకుల పోరాటం కాకూడదు. దక్షిణాదిలోని ప్రతి పౌరుడికి ఈ అన్యాయం గురించి తెలియాలి. మా నిధులు మాకే - మా హక్కులు మాకే అనే నినాదం మార్మోగాలి. కార్పొరేట్ శక్తులకు దేశ వనరులను కట్టబెడుతూ, రాష్ట్రాల హక్కులను కాలరాస్తున్న మోదీ ప్రభుత్వానికి దక్షిణాది నుంచే అసలైన ప్రతిఘటన మొదలవ్వాలి. లెఫ్ట్, డెమోక్రటిక్, సెక్యులర్ శక్తులు ప్రజలను ఆర్గనైజ్ చేసి, ఒక భారీ 'సౌత్ ఇండియా ర్యాలీ' ద్వారా తమ సత్తా చాటాలి. దక్షిణాది రాష్ట్రాల అభివృద్ధి దేశానికి గర్వకారణం కావాలి కానీ, అది మన బలహీనత కాకూడదు. ఢిల్లీ పీఠం దక్షిణాదిని శాసించడం కాదు, దక్షిణాది ప్రజాస్వామిక గళం ఢిల్లీని నియంత్రించే రోజు రావాలి. అది మన ఆత్మగౌరవ పోరాటం!

# ఏపీ పోలీసుల ముందు లొంగిపోయిన మావోయిస్టు కీలక నేత

- మొదటి పేజీ తరువాయి

అలియాస్ సోమన్న ఆంధ్రప్రదేశ్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. ఈ పరిణామం ఏవోబీ ప్రాంతంలో మావోయిస్టుల ఉనికిని దాదాపు లేకుండా చేసినట్లయ్యిందని భద్రతా వర్గాలు విశ్లేషిస్తున్నాయి. నారాయణరావు ప్రస్థానం పీపుల్స్ వార్ కాలం నుంచే ప్రారంభమైంది. పార్టీలో అంచెలంచెలుగా ఎదుగుతూ పలు కీలక హోదాల్లో పనిచేశారు. ఏవోబీ ప్రాంతంలో పార్టీ కార్యకలాపాలను విస్తరించడంలో, రిక్రూట్‌మెంట్లు చేపట్టడంలో ఆయనది కీలక పాత్ర. అటవీ ప్రాంతంలో దశాబ్దాల కాలం పాటు గెరిల్లా పోరాటంలో ఆరితేరిన సోమన్న లొంగుబాటును ఏపీ డీజీపీ త్వరలోనే అధికారికంగా ధ్రువీకరించనున్నారు.గత ఏడాది కాలంగా ఛత్తీస్‌గఢ్, ఆంధ్రప్రదేశ్, ఒడిశా సరిహద్దుల్లో భద్రతా బలగాలు చేపట్టిన 'ఆపరేషన్ కగార్' మావోయిస్టుల కోటలను బద్దలు కొట్టింది. ముఖ్యంగా, 2026 మార్చి 31 (రేపు) నాటికి దేశంలో మావోయిజాన్ని పూర్తిగా అంతం చేయాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా నిర్దేశించిన లక్ష్యం దిశగా బలగాలు దూసుకుపోతున్నాయి. ఈ గడువు ముగియడానికి కేవలం కొన్ని గంటల ముందే అత్యంత కీలక నేత సోమన్న లొంగిపోవడం గమనార్హం.

# రూ.404 కోట్ల ఆస్తులు, ఖరీదైన కార్లు అఫిడవిట్‌లో పేర్కొన్న విజయ్

రాజకీయాల్లోకి ఎంట్రీ ఇచ్చిన సినీ నటుడు, టీవీకే అధ్యక్షుడు విజయ్ ఎన్నికల అఫిడవిట్‌లో తన ఆస్తులను రూ.404.58 కోట్లుగా చూపించారు. అఫిడవిట్ ప్రకారం ఆయన ఆస్తులు మొత్తం రూ. 4,04,58,57,196గా ఉంది. బ్యాంకు డిపాజిట్లు, పెట్టుబడులు, వాహనాలు, ఇతర చరాస్తులతో సహా ఆయన ఆర్థిక వివరాలను ఈ అఫిడవిట్‌లో వివరంగా పొందుపరిచారు. తన వద్ద నగదు రూపంలో రూ.2 లక్షలు, భార్య సంగీత వద్ద రూ.1 లక్ష ఉన్నట్లు ఎన్నికల అఫిడవిట్‌లో పేర్కొన్నారు. వివిధ బ్యాంకుల్లో సేవింగ్స్, ఫిక్స్‌డ్ డిపాజిట్ల రూపంలో రూ.388 కోట్లు ఉన్నట్లు తెలిపారు. తన వద్ద బీఎండబ్ల్యూ 530, బీఎండబ్ల్యూ ఐ7, టయోటా లెక్సస్ 350, టయోటా వెల్‌ఫైర్ వంటి ఖరీదైన కార్లతో పాటు ఇతర ఆటోమొబైల్స్, ద్విచక్ర వాహనాలు కూడా ఉన్నాయని పొందుపరిచారు. వాహనాల మొత్తం విలువ రూ.14.35 కోట్లుగా పేర్కొన్నారు.

తన వద్ద 883 గ్రాముల బంగారం, దాని విలువ రూ.1.20 కోట్లు ఉంటుందని వెల్లడించారు. రూ.15 లక్షల విలువైన వెండి వస్తువులు ఉన్నట్లు వెల్లడించారు. తనవద్ద ఉన్న స్థిరాస్తుల్లో తాను కొన్నవాటితో పాటు, వారసత్వంగా వచ్చినవి కూడా ఉన్నాయని వెల్లడించారు. స్వయం ఉపాధి, వడ్డీ, ఆస్తుల నుంచి వచ్చే అద్దె తన ప్రధాన ఆదాయవనరు అని పేర్కొన్నారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 184.53 కోట్ల ఆదాయం ఆర్జించినట్లు విజయ్ పేర్కొన్నారు.

# తిరుమలలో తగ్గిన భక్తుల రద్దీ

తిరుమల కొండపై భక్తుల రద్దీ కాస్త తగ్గింది. సోమవారం కావడంతో భక్తుల తాకిడి సాధారణ స్థాయిలో కొనసాగుతోంది. ప్రస్తుతం 10 కంపార్ట్‌మెంట్లలో భక్తులు స్వామివారి దర్శనం కోసం వేచి ఉన్నారు. టోకెన్లు లేని సర్వదర్శనం భక్తులకు శ్రీవారిని దర్శించుకోవడానికి సుమారు 8 గంటల సమయం పడుతోందని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) అధికారులు తెలిపారు.నిన్న ఆదివారం (మార్చి 29) నాడు మొత్తం 80,774 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. వీరిలో 27,447 మంది భక్తులు తలనీలాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు సమర్పించిన కానుకల ద్వారా ఆదివారం ఒక్కరోజే శ్రీవారి హుండీ ఆదాయం రూ. 4.05 కోట్లుగా నమోదైంది.

సాధారణంగా వారాంతాల్లో భక్తుల తాకిడి ఎక్కువగా ఉండి, కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోతుంటాయి. అయితే, వారాంతం ముగియడంతో ప్రస్తుతం రద్దీ కాస్త అదుపులో ఉంది. భక్తులు తక్కువ సమయంలోనే దర్శనం చేసుకుంటున్నారు.

## ఎల్డీఎఫ్-బీజేపీల మధ్య రహస్య ఒప్పందం ఉంది:

# కేరళలో రాహుల్ గాంధీ విమర్శలు

కేరళ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రాజకీయ విమర్శల పదును పెంచారు. రాష్ట్రంలో అధికార ఎల్డీఎఫ్ (వామపక్ష కూటమి) - కేంద్రంలోని బీజేపీ మధ్య రహస్య ఒప్పందం ఉందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. పత్తనంతిట్ట జిల్లా అడూర్‌లో జరిగిన ర్యాలీలో మాట్లాడుతూ... కేరళలో కాంగ్రెస్ నేతృత్వంలోని యూడీఎఫ్ కేవలం వామపక్షాలతోనే కాకుండా, 'ఎల్డీఎఫ్-బీజేపీ' కూటమితో కూడా పోరాడుతోందని అన్నారు.పాలక్కాడ్ పర్యటనలో ప్రధాని మోదీ శబరిమల ఆలయ అంశాన్ని ఎందుకు ప్రస్తావించలేదని రాహుల్ ప్రశ్నించారు. ఆలయ బంగారాన్ని కాజేశారన్న ఆరోపణలపై ప్రధాని మౌనం వహించడం వెనుక రాజకీయ వ్యూహం ఉందన్నారు. కేవలం ఓట్ల కోసమే మోదీకి గుడులు, మతం గుర్తొస్తాయని ఎద్దేవా చేశారు.కేంద్ర దర్యాప్తు సంస్థలు కేవలం తన వంటి ప్రతిపక్ష నేతలను లక్ష్యంగా చేసుకుంటున్నాయని, 36 కేసులు పెట్టి 55 గంటల పాటు విచారించాయని రాహుల్ గుర్తు చేశారు. అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న సీఎం పినరయి విజయన్‌పై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. విజయన్ అవినీతి మరకల వల్లే మోదీ గుప్పిట్లో ఉన్నారని, అందుకే వామపక్ష ప్రభుత్వం 'కార్పొరేట్ నిధుల ప్రభుత్వం'గా మారిందని విమర్శించారు.

# హర్మూజ్ తెరవకపోతే ఖర్గ్ దీవిని నాశనం చేస్తాం

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌కు మరోసారి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. హర్మూజ్ జలసంధిని తక్షణమే తెరవాలని, లేనిపక్షంలో ఇరాన్‌లోని ఖర్గ్ దీవితో సహా కీలకమైన చమురు బావులు, విద్యుత్ కేంద్రాలను పేల్చివేస్తామని అల్టిమేటం ఇచ్చారు. ఈ పరిణామం మధ్యప్రాచ్యంలో మరోసారి ఉద్రిక్తతలను పెంచింది.

ట్రూత్ సోషల్ వేదికగా స్పందించిన ట్రంప్, ఇరాన్‌లోని కొత్త నాయకత్వంతో చర్చలు జరుపుతున్నామని, వాటిలో గణనీయమైన పురోగతి ఉందని తెలిపారు. అయితే, ఒప్పందం త్వరగా కుదరకపోయినా లేదా హర్మూజ్ జలసంధిని తెరవకపోయినా తీవ్ర చర్యలు తప్పవన్నారు. ఇరాన్‌లోని చమురు బావులు, విద్యుత్ ఉత్పాదక కేంద్రాలు, ఇతర కీలక సౌకర్యాలను ధ్వంసం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటివరకు ఉద్దేశపూర్వకంగా వదిలేసిన మంచినీటి డీశాలినేషన్ ప్లాంట్లను కూడా లక్ష్యంగా చేసుకునే అవకాశాలున్నాయని సంకేతాలిచ్చారు. గత 47 ఏళ్ల ఇరాన్ పాలనలో మరణించిన అమెరికా సైనికులకు ప్రతీకారంగానే ఈ చర్యలు ఉంటాయని ట్రంప్ స్పష్టం చేశారు.ఒకవైపు చర్చల్లో పురోగతి ఉందని ట్రంప్ చెబుతున్నప్పటికీ, మరోవైపు అమెరికా ఆ ప్రాంతంలో అదనపు సైన్యాన్ని మోహరిస్తోంది. దీనిపై ఇరాన్ పార్లమెంట్ నాయకులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. చర్చల పేరుతో అమెరికా దండయాత్రకు సిద్ధమవుతోందని వారు ఆరోపించారు. అయితే, అమెరికాతో ఎలాంటి ప్రత్యక్ష చర్చలు జరగడం లేదని

ఇరాన్ నాయకులు ఖండించారు.

ప్రపంచ చమురు సరఫరాలో కీలకమైన హర్మూజ్ జలసంధిని ఇరాన్ సైనిక శక్తులు ఇటీవల నౌకాయానానికి దాదాపు మూసివేశాయి. గతంలో ఇరాన్ ఇంధన కేంద్రాలపై దాడులను 10 రోజుల పాటు నిలిపివేస్తున్నట్లు ట్రంప్ ప్రకటించగా, ఆ గడువు ఏప్రిల్ 6తో ముగియనుంది. ఈ నేపథ్యంలో ట్రంప్ తాజా హెచ్చరికలు ప్రపంచ చమురు మార్కెట్లపై, మధ్యప్రాచ్య భద్రతపై ఆందోళన కలిగిస్తున్నాయి.

# ఎయిర్‌పోర్టుల్లో చౌక ధరలకే ఫుడ్.. రూ.10కే టీ, రూ.20కే స్నాక్స్

- మొదటి పేజీ తరువాయి

ఏర్పాటు చేసిన "ఉడాన్ యాత్రి కేఫ్"ల సేవలను మరింత విస్తరించింది. తాజాగా దేశంలోని మరో 11 విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ కేఫ్‌లలో టీ, కాఫీ, సమోసా, వాటర్ బాటిల్ వంటివి కేవలం రూ.10 నుంచే లభించనున్నాయి.రాజ్‌కోట్ విమానాశ్రయం నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి, ఈ కేఫ్‌లతో పాటు దేశవ్యాప్తంగా 57 విమానాశ్రయాల్లో ప్రయాణికులకు ఉపయోగపడే పలు ఇతర సౌకర్యాలను కూడా అందుబాటులోకి తెచ్చినట్లు తన ఎక్స్ ఖాతాలో వెల్లడించారు. కొత్తగా ప్రారంభించిన ఉడాన్ యాత్రి కేఫ్‌లలో లక్నో, పాట్నా, రాజ్‌కోట్, జమ్మూ, శ్రీనగర్, జైపూర్, ఇండోర్ వంటి కీలక విమానాశ్రయాలు ఉన్నాయి. వీటితో పాటు డిజి యాత్ర, ఉచిత వైఫై సేవలు, ప్రయాణికుల కోసం ఉచిత గ్రంథాలయం 'ఫ్లైబ్రరీ', పిల్లల కోసం ప్రత్యేకంగా 'కిడ్స్ జోన్' వంటి సౌకర్యాలను కూడా ప్రారంభించారు. స్థానిక స్వయం సహాయక బృందాల ఉత్పత్తులను ప్రోత్సహించేందుకు 'అవ్సర్' (ూాయాూా=) ఔట్‌లెట్లను కూడా తెరిచారు.

### అందుబాటు ధరలు.. స్థానిక రుచులు

ఈ ఉడాన్ యాత్రి కేఫ్‌లలో ధరలు చాలా అందుబాటులో ఉంటాయి. సాధారణంగా టీ రూ.10, వాటర్ బాటిల్ రూ.10, కాఫీ రూ.20, స్నాక్ రూ.20, స్వీట్ ఆఫ్ ది డే రూ.20కి లభిస్తుంది. ఈ కేఫ్‌ల మెనూలో మరో ప్రత్యేకత ఏమిటంటే, ఆయా ప్రాంతాల

స్థానిక రుచులకు ప్రాధాన్యత ఇవ్వడం. ఉదాహరణకు పుణె ఎయిర్‌పోర్టులో వడా పావ్, చెన్నైలో వడై, కోయంబత్తూరులో మెధు వడ వంటివి అందిస్తున్నారు. అయితే, దాదాపు అన్ని కేఫ్‌లలో సమోసా కామన్‌గా లభిస్తోంది.

ఇప్పటికే కోల్‌కతా, చెన్నై, పుణె, విజయవాడ, ఇటానగర్, భువనేశ్వర్, సూరత్, అహ్మదాబాద్, ముంబై, మంగళూరు, తిరువనంతపురం, కోయంబత్తూరు విమానాశ్రయాల్లో ఈ కేఫ్‌లు విజయవంతంగా నడుస్తున్నాయి. తాజాగా మరో 11 చోట్ల వీటిని ప్రారంభించడంతో ప్రయాణికులపై భారం తగ్గనుంది.

# డిసెంబర్‌లోపు మరో 4.50 లక్షల ఇళ్లు ఇస్తాం

- మొదటి పేజీ తరువాయి

మతసామరస్యానికి ప్రతీకగా నిలిచింది. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు మంత్రులు కొలుసు పార్థసారధి, పొంగూరు నారాయణ, అనగాని సత్యప్రసాద్, స్థానిక ఎమ్మెల్యే విజయశ్రీ, పలువురు ఉన్నతాధికారులు, నాయకులు పాల్గొన్నారు.

## లాకర్లలోని వస్తువులను బ్యాంకులు చూడవు, రికార్డు చేయవు

- మొదటి పేజీ తరువాయి

భద్రపరిచిన విలువైన వస్తువుల బీమా కవరేజీ అంశంపై ఆమె మాట్లాడారు. వస్తువుల ఆధారంగా బీమా కవరేజీ ఉంటుందనే వాదనను ఆమె తోసిపుచ్చారు. ఆర్బీఐ నిబంధనల ప్రకారం దొంగతనం, అగ్నిప్రమాదం, బ్యాంకుల్లో మోసాలు వంటి సందర్భాల్లో నష్టం వాటిల్లితే పరిహారం అందిస్తాయని అన్నారు. లాకర్ వార్షిక అద్దెకు 100 రెట్లు పరిహారాన్ని బ్యాంకులు చెల్లిస్తున్నట్లు తెలిపారు. కానీ లాకర్లలోని వస్తువులను బ్యాంకులు తనిఖీ చేయలేవు కాబట్టి విలువ ఆధారంగా పరిహారం చెల్లించడం సాధ్యం కాదని స్పష్టం చేశారు. ప్రస్తుతానికి బీమా కవరేజీకి సంబంధించి కొత్త ప్రతిపాదనలేవీ పరిశీలనలో లేవని స్పష్టం చేశారు.

## పవన్ కల్యాణ్‌కు ధన్యవాదాలు తెలిపిన ముఖ్యమంత్రి చంద్రబాబు

- మొదటి పేజీ తరువాయి

ప్రజల సంక్షేమం కోసం కూటమి పక్షాల ఐక్యతకు మీరు అందిస్తున్న సహకారం అభినందనీయం. నాకున్న అనుభవానికి తోడుగా, ఉత్తమ ఆకాంక్షలు, ఆదర్శాలు కలిగిన మీ వంటి ప్రజానేతలు కలిసివస్తే రాష్ట్రానికి, దేశానికి ఎంతటి మేలు జరుగుతుందో గత 20 నెలల పాలన ఒక నిదర్శనం" అని పవన్ కల్యాణ్ ను ఉద్దేశించి పేర్కొన్నారు.ప్రజా సంక్షేమమే లక్ష్యంగా ఏర్పడిన తమ కూటమి ఐక్యతా స్ఫూర్తి ఇలాగే పదికాలాల పాటు కొనసాగాలని చంద్రబాబు ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రగతి ప్రస్థానంలో పవన్ కల్యాణ్ వంటి నేతల పాత్ర కీలకమని, ఆయన తోడ్పాటుతో రాష్ట్రాన్ని మరింత ముందుకు తీసుకువెళతామని చంద్రబాబు తన సందేశంలో స్పష్టం చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీల మధ్య ఉన్న సమన్వయం రాష్ట్రానికి శుభపరిణామమని ఆయన అభిప్రాయపడ్డారు.

## కొల్లు రవీంద్ర ఏజెంట్లకు రెవెన్యూ యంత్రాంగం తొత్తుగా మారింది

- మొదటి పేజీ తరువాయి

మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. మచిలీపట్నంలో జాయింట్ కలెక్టర్‌ను కలిసిన ఆయన... ఆర్డీవో, ఎమ్మార్వోలపై ఫిర్యాదు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వ తీరును ఎండగట్టారు.

స్థానిక మంత్రి కొల్లు రవీంద్ర ఏజెంట్లకు రెవెన్యూ యంత్రాంగం తొత్తుగా మారిందని నాని ఆరోపించారు. "వందల ఎకరాలు ఉన్న బడా రైతులకు రెడ్ కార్పెట్ పరుస్తున్న అధికారులు... ఎకరం, అర ఎకరం ఉన్న చిన్న రైతులను మాత్రం పట్టిపీడిస్తున్నారు. చెరువు రిపేరు చేయాలన్నా రూ. 50 వేలు, బోరు వేయాలన్నా మరో రూ. 50 వేలు వసూలు చేస్తూ వికృత సంస్కృతికి తెరలేపారు" అని ధ్వజమెత్తారు.పెదపట్నం, కానూరు గ్రామాల్లో మడ అడవులను యథేచ్ఛగా నరికి చెరువులు తవ్వుతుంటే పట్టించుకోని అధికారులు, కోన గ్రామంలోని ఓ చిన్న రైతును రికార్డుల పేరుతో వేధించడం దారుణమన్నారు. 83 సెంట్ల భూమి ఉన్న రైతును ఆర్డీవో సాంబశివరావు నానా హైరానా పెట్టి, చెరువును పూడ్చాలని ఆదేశించడం ఏ రకమైన న్యాయమని ప్రశ్నించారు. ముడుపుల మాయలో పడి చిన్న రైతుల పొట్ట కొట్టాలని చూస్తే సహించేది లేదని, బాధితుల పక్షాన పోరాడతామని పేర్ని నాని హెచ్చరించారు.

### తిరుపతిలో వెయ్యి కోట్ల భూదందా..

- మొదటి పేజీ తరువాయి

పాత్రధారి అని ఆయన ఆరోపించారు. తిరుపతిలో మీడియాతో మాట్లాడుతూ ఆయన ఈ ఆరోపణలు గుప్పించారు. తిరుపతి నడిబొడ్డున ఉన్న 22 ఎకరాల విలువైన భూమిని కేవలం 94 కోట్ల రూపాయలకే రెండు రియల్ ఎస్టేట్ సంస్థలకు అప్పగించారని భూమన ఆరోపించారు. "దివ్యశ్రీ రియల్ ఎస్టేట్ (బెంగళూరు), సైబర్ సిటీ డెవలపర్ (హైదరాబాద్) సంస్థలకు ఎటువంటి బహిరంగ ప్రకటన లేకుండానే భూములు దోచిపెట్టారు. ఈ సంస్థల్లో లోకేశ్ భాగస్వామిగా ఉన్నారా? లేక ఇవి ఆయన బినామీ సంస్థలా?" అని ప్రశ్నించారు. ఈ ఒప్పందం వెనుక సుమారు 300 నుంచి 400 కోట్ల రూపాయలు చేతులు మారాయని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.ప్రభుత్వ భూములను అతి తక్కువ ధరకు అమ్మడమే కాకుండా, సదరు సంస్థలకు అసాధారణ రాయితీలు కల్పించారని భూమన విమర్శించారు. 15 ఏళ్ల పాటు ఏపీ జీఎస్టీ ప్రోత్సాహకాలు, స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్ కల్పించారని అన్నారు. ఐదేళ్ల పాటు ప్రాపర్టీ ట్యాక్స్ మినహాయింపు ఇవ్వడం దారుణమని మండిపడ్డారు. సాధారణంగా టూరిజం ప్రాజెక్టులను పీపీపీ విధానంలో ఇస్తారని, కానీ ఇక్కడ 'ఫ్రీ హోల్డ్' విధానంలో కట్టబెట్టడం వెనుక పెద్ద మతలబు ఉందని ఆరోపించారు.

ఎలాంటి అనుభవం లేని రియల్ ఎస్టేట్ సంస్థలకు వందల కోట్ల విలువైన భూములు కేటాయించడంలో ఆంతర్యమేమిటని భూమన ప్రశ్నించారు. తిరుపతి ఆస్తులను ప్రైవేటు వ్యక్తులకు దోచిపెడుతున్న కూటమి ప్రభుత్వంపై ప్రజలు ఆగ్రహంతో ఉన్నారని, ఈ భూదందాను అడ్డుకుని తీరుతామని ఆయన హెచ్చరించారు.

# సొంతింటి కల సాకారమైన వేళ.. జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ...






పెన్ పవర్, విజయవాడ, మార్చి, 30. పేదల జీవితాల్లో వెలుగులు నింపేలా పీఎం, సీఎం ఆకాంక్షలకు అనుగుణంగా లబ్ధిదారులకు సొంతింటి కల నెరవేరిందని.. సొంతిల్లు పొందిన ప్రతిఒక్కరికీ శుభాకాంకలు తెలియజేస్తున్నట్లు ఎన్‌టీఆర్ జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్ అన్నారు.సోమవారం జక్కంపూడిలోని ఎన్‌టీఆర్ నగర్‌లో జరిగిన లబ్ధిదారులకు టిడ్కో ఇళ్ల పంపిణీ కార్యక్రమంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, శాసనసభ్యులు గద్దె రామ్మోహన్, బోండా ఉమామహేశ్వరరావు, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ సొంతిల్లు అనేది జీవితకాల కల అని.. గౌరవ ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల కృషితో అది నేడు నెరవేరిందని పేర్కొన్నారు. ఎన్ని ఇబ్బందులు ఉన్నా ఎక్కడా రాజీ పడకుండా కృషిచేయడం వల్ల ఇంతమంచి కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామని పేర్కొన్నారు. వివిధ నియోజకవర్గాల్లో ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని.. ఈ రోజు జక్కంపూడి ఎన్‌టీఆర్ నగర్‌లో 2,256 ఇళ్లను లబ్ధిదారులకు అందజేయడం జరుగుతోందన్నారు. మిగిలిన ఇళ్లను కూడా త్వరితగతిన పూర్తిచేసి రెండు మూడు నెలల్లో అందజేస్తామని వెల్లడించారు. ఒక్క రూపాయితోనే పొందిన 300 ఎస్ఎఫ్‌టీ ఇంటి మార్కెట్ ధర ప్రస్తుతం రూ. 12 లక్షలు ఉందని.. అదేవిధంగా దాదాపు మూడున్నర లక్షలతో పొందే 365 ఎస్ఎఫ్‌టీ ఇల్లు రూ. 14 లక్షలు, దాదాపు రూ. 4 లక్షలతో పొందే 430 ఎస్ఎఫ్‌టీ ఇల్లు రూ. 17 లక్షల వరకు ఉందని వివరించారు. దీన్నిబట్టి ఏస్థాయిలో స్థిరాస్తి సొంతమైందో అర్థం చేసుకోవచ్చన్నారు. మంచి రహదారులు, విద్యుత్, మంచినీటి సౌకర్యం, డ్రెయిన్లు, పార్కులు ఇలా సకల సౌకర్యాలూ కల్పించడం జరుగుతోందని కలెక్టర్ లక్ష్మీశ వివరించారు.

వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర దిశగా..

వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర సాధనలో ప్రతిఒక్కరూ భాగస్వాములు కావాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. హెల్తీ, వెల్తీ, హ్యాపీ ఆంధ్ర లక్ష్యంగా వేస్తున్న అడుగుల్లో వడివడిగా నడవాలని సూచించారు. ప్రతిఒక్కరూ కాలనీలో పారిశుద్ధ్యం బాగుండేలా చూడాలని.. సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకుండా ప్రతినబూనాలని పేర్కొన్నారు. ఒక కుటుంబం-ఒక పారిశ్రామికవేత్త లక్ష్యాలకు అనుగుణంగా ప్రభుత్వ పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటూ ముందడుగు వేయాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు.

ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాం: ఎమ్మెల్యే బోండా ఉమామహేశ్వరరావు

చిన్నదో, పెద్దదో సొంతిల్లు ఉండాలనేది ప్రతిఒక్కరి జీవిత కల అని.. ఆ కలను నేడు నెరవేర్చడం జరిగిందని శాసనసభ్యులు బోండా ఉమామహేశ్వరరావు అన్నారు. పేదవానికి పక్కా ఇల్లు ఉండాలనేది నాటి ముఖ్యమంత్రి ఎన్‌టీ రామారావు సంకల్పించి అడుగులు వేస్తే చంద్రబాబు నాయుడు తన హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఇళ్లు కట్టించి ఇచ్చారన్నారు. నాణ్యతలో ఎక్కడా రాజీపడకుండా ఇళ్ల నిర్మాణం జరిగిందన్నారు. ఇల్లు వస్తుందో రాదో అనే ఆందోళన లబ్ధిదారుల్లో ఉండేదని.. మాటను నిలబెట్టుకుండా ఈ రోజు ఇళ్లను అప్పగించడం జరిగిందన్నారు.

పేదల కష్టాలు తొలగాయి: ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ పేదల అద్దె ఇంటి కష్టాలు నేడు తొలగాయని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. ఈ ప్రభుత్వం వచ్చిన దగ్గరి నుంచి శరవేగంగా ముందడుగు వేసి ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేసి అప్పగించడం జరుగుతోందన్నారు. పూర్తయిన ఇళ్లు పూర్తయినట్లుగా వెనువెంటనే లబ్ధిదారులకు అందిస్తున్నట్లు తెలిపారు. సొంతింటిని పొందిన ప్రతిఒక్కరికీ అభినందనలు తెలియజేస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో టిడ్కో ప్రాజెక్టు డైరెక్టర్ బి.చిన్నోడు, విజయవాడ నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ (ప్రాజెక్ట్) డా. డి.చంద్రశేఖర్, జోనల్ కమిషనర్లు బి.రమ్య కీర్తన, కె.ప్రభుదాస్, కె.షమ్మీ, ప్రాజెక్ట్ ఆఫీసర్ (యూసీడీ) ఎం.విజయలక్ష్మి, జాయింట్ డైరెక్టర్ అమృత్ ఇంచార్జ్, ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, సూపరిండెంటింగ్ ఇంజనీర్ (వర్క్స్) వి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు....

# పీఎంఏవై కింద నిర్మించిన ఇంటి గృహ ప్రవేశానికి హాజరైన ఎమ్మెల్యే గళ్ళా మాధవి...





పెన్ పవర్, గుంటూరు, మార్చి, 30. ఆంధ్రప్రదేశ్ లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం ఉగాది కల్లా గృహప్రవేశాలు నిర్వహిస్తామని ఇచ్చిన హామీని నిలబెట్టుకుంటూ మార్చి 30 నాటికే రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారుల ఇళ్లలో ఆనందాన్ని నింపుతున్నామని గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. సోమవారం గుంటూరు పశ్చిమ నియోజకవర్గం 24వ డివిజన్ శివరామ్ నగర్‌లో పీఎంజయ్ పథకం కింద కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ నిధులతో కప్పల నాగ శ్రీమణి నిర్మించిన ఇంటి గృహప్రవేశ కార్యక్రమానికి ఎమ్మెల్యే గళ్ళా మాధవి హాజరయ్యారు.

అనంతరం ఎమ్మెల్యే గళ్ళా మాధవి మాట్లాడుతూ...

సొంత ఇల్లు ప్రతి సామాన్యుడి కల అని, అది ఆత్మగౌరవం, భరోసా, స్వేచ్ఛకు ప్రతీక అని, 2016లో ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ హౌసింగ్ పథకం కింద టిడ్కో ఇళ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టిన నారా చంద్రబాబు నాయుడు దూరదృష్టిని ఎమ్మెల్యే గళ్ళా మాధవి గుర్తుచేశారు. ప్రతి సామాన్యుడికి సొంత ఇల్లు కల్పించి, మెరుగైన అర్బన్ జీవన ప్రమాణాలు అందించాలనే లక్ష్యంతో ఈ పథకం తీసుకువచ్చారని తెలిపారు.

గత వైసిపి ప్రభుత్వ వైఫల్యాల వల్ల టిడ్కో ఇళ్ల పంపిణీ ఆలస్యమైందని, దాదాపు 90% పూర్తయిన ఇళ్లను కూడా లబ్ధిదారులకు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. వాటి మరమ్మతుల కోసం సుమారు ?200 కోట్లకు పైగా ఖర్చు చేయాల్సి వచ్చిందని, బ్యాంకు రుణాల భారం, పన్నుల రూపంలో లబ్ధిదారులపై ?3000 కోట్ల భారం పడిందని పేర్కొన్నారు. అదనంగా మౌలిక సదుపాయాల అభివృద్ధికి ?4000 కోట్ల వరకు రుణాలు తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని తెలిపారు. ఎన్నికల సమయంలో మాత్రమే ఈ పథకాన్ని వైసిపి ఉపయోగించుకుని, లబ్ధిదారులకు స్పష్టమైన సమాచారం ఇవ్వకుండా గందరగోళం సృష్టించారని విమర్శించారు. కొంతమంది లబ్ధిదారులు తమకు ఇచ్చిన ఇళ్ల వివరాలు కూడా తెలియక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం పారదర్శకంగా, న్యాయబద్ధంగా పిఎంఏవై పథకం కింద లబ్ధిదారుల పేర్లతో ఇళ్లను అందజేస్తోందని, ఇది నిజమైన సుపరిపాలనకు నిదర్శనమని పేర్కొన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో వెంగలాయపాలెం ఫేజ్-2 కింద 832 ఇళ్లను లబ్ధిదారులకు అందజేయడం జరిగిందని, అర్బన్ ప్రాంతాల్లో ఇల్లు లేని ప్రజల సమస్యలను పరిష్కరించడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. రోడ్ల పక్కన, డ్రైన్ల వద్ద, ప్రభుత్వ భూముల్లో భయాందోళనలతో నివసించే ప్రజలకు ఈ ఇళ్లు శాశ్వత భరోసా కల్పిస్తాయని చెప్పారు. లబ్ధిదారుల కళ్లలో ఆనందం చూడటం ఎంతో సంతోషంగా ఉందని, వారి సంక్షేమం, అభివృద్ధి, సాధికారత కోసం నారా చంద్రబాబు నాయుడు గారి నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు...

# పేరుకే అభివృద్ధి పనిలో మాత్రం లేదు

## సూర్య లంక తీరంలో యాత్రికుల ఇక్కట్లు

## అభివృద్ధి దేవుడుకు ఇరుగు ఉన్నవి పీకేసిన వైనం



పెన్ పవర్ బ్యూరో బాపట్ల మార్చి 30: రాష్ట్రంలో సూర్యలంక సముద్ర తీరానికి ఎంతో పేరు ఉంది. ఈ సముద్ర తీరంలో యాత్రికులు సేద తీరడానికి ఆహ్లాదకర వాతావరణం, ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ వారి హరితా రిసార్ట్స్,కొన్ని ప్రైవేట్ రిసార్ట్స్ ఇలా చాలా సౌకర్యాలు ఉన్నాయి. వీటిలో ప్రభుత్వం వారు ఏర్పాటు చేసిన హరితా రిసార్ట్స్, బీచ్లో యాత్రికులు సేద తీరేందుకు గొడుగు బల్లలు ఇలా రకరకాలుగా వసతులు ఉన్న అవి ఉపయోగకరంగా లేవని నియోజకవర్గ ప్రజలు అనుకుం టున్నారు. సూర్య లంక తీరంను అభివృద్ధి చేసి జిల్లాకు తలమానికం చేద్దామని కూటమి నాయకులు నిధులు మంజూరు చేయించి పని చేస్తున్నామని చెబుతున్నారు కానీ మాటలలో చెప్పినంతగా చేతలలో జరగడం లేదు అనేది బాపట్ల ప్రజల భావన. ప్రభుత్వం నుండి 99 కోట్ల రూపాయల నిధులు తీసుకు వచ్చామని బీచ్ ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతున్నామని పనులు ప్రారంభించారు. ఇక్కడికి బాగానే ఉన్నా ఈ అభివృద్ధి పేరుతో ఉన్న వసతులను తీసివేసి యాత్రికులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నారు.

పెన్ పవర్ సెంట్రల్ ఆంధ్ర
కృష్ణా జిల్లా | ఎన్.టి.ఆర్. జిల్లా | గుంటూరు జిల్లా | పల్నాడు జిల్లా | బాపట్ల జిల్లా

# లాలపేట పోలీస్ స్టేషన్ పరిధిలో ఇంట్లో చోరీ.. ఎస్పీ వకుల్ జిందాల్..






పెన్ పవర్, గుంటూరు, మార్చి, 30.లాలాపేట పోలీస్ స్టేషన్ పరిధిలోనీ ఇందిరా ప్రియదర్శిని కాలనీ లో ఈ నెల 7/3/2026 వ తేదీన తాళం వేసిన ఇంటిని దొంగలు దోచుకున్నారు.. పట్టపగలు ఇంటి తాళం విరగకొట్టి బీరువా నీ బద్దలు కొట్టి 246 గ్రాముల బంగారం కొంత నగదును దోచుకున్నారు.. దర్యాప్త చేపట్టిన లాలపేట పోలీసులు... ఇమ్రాన్ 40 మరియు రషీద్ 38 ఈ దొంగతనం చేసినట్లుగా గుర్తించారు.. ఇద్దరు దొంగలు ఉత్తరప్రదేశ్లోని గజియాబాద్ జిల్లాకు చెందిన వారు.. వీరి దగ్గర నుంచి 246 గ్రాముల బంగారం.. 136 గ్రాముల గోల్డ్ పీసెస్.. 132 చిన్న చిన్న వజ్రాలు నాలుగు లక్షల రూపాయల నగదుని స్వాధీనం చేసుకున్నాం.. వీరిపై ఇదివరకే దొంగతనం కేసులు ఉన్నాయి బెయిల్ పై కోర్టుకు హాజరవుతూ మరల దొంగతనలకు పాల్పడుతున్నారు.. ఆంధ్రప్రదేశ్లో రాజమండ్రి, పెద్దాపురం, యానం,పరిసర ప్రాంతాల్లో దొంగతనాలకు పాల్పడ్డారు.. దొంగతనం చేసిన డబ్బులతో సౌదీ,గోవా, ముసోరి, ప్రాంతాలకు విహారయాత్రలకు వెళుతూ ఉంటారు...!

# జవాబుదారితనంతో అర్జీలను పరిష్కరించాలి..జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ....



పెన్ పవర్, విజయవాడ, మార్చి, 30. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా అందే అర్జీలను పారదర్శకంగా, జవాబుదారీతనంతో స్పష్టతతో అర్జీదారుడు సంతృప్తి చెందేలా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెసల్ సిస్టమ్ (పీజీఆర్ఎస్)) కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీదారుల నుండి స్వీకరించిన సమస్యలకు సంబంధించి అర్జీలను క్షుణ్ణంగా పరిశీలించి శాశ్వత పరిష్కారం చూపే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. చొరవ చూపాలన్నారు. ప్రతి అర్జీని అధికారులు వ్యక్తిగత సమస్యగా భావించి పరిష్కార మార్గం చూపాలన్నారు. పిజిఆర్ఎస్‌లో నమోదు అయ్యే అర్జీల పరిష్కారం పై రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారని, ఈ నేపథ్యంలో క్షేత్రస్థాయిలో అధికారులు సమస్యలను పరిశీలించి నిర్ణీత కాల పరిమితిలోగా పరిష్కరించాలని కలెక్టర్ లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. 98 అర్జీల నమోదు. ఎంఏయుడి 24, పంచాయతీరాజ్ 11, పోలీస్ శాఖకు 10, మార్కెటింగ్ 6, డిఆర్‌డిఏ 5, రెవెన్యూ శాఖకు సంబంధించి 5, పౌరసరఫరాలు 5, విద్య 4, వ్యవసాయం 3, విద్యుత్ 3, ఉపాధి కల్పన 3, ఆర్‌డబ్ల్యుఎస్ 3, హెల్త్ 2, భూగర్భ గనులు 2, దేవాదాయ 2, మత్స్య 2, సర్వే, పరిశ్రమలు, జలవనరులు, ఏపిఎస్‌డబ్ల్యుఆర్ఇఐఎస్, డ్వామా, కార్మిక శాఖ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, రోడ్లు మరియు భవనాల కు సంబంధించిన ఒక్కో అర్జీతో కలిపి మొత్తం 98 అర్జీలను స్వీకరించడం జరిగిందని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు....

# స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కండి -వరికూటి అశోక్ బాబు పిలుపు



భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చి, 30: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్(ఎస్ ఐ ఆర్) కార్యక్రమంలో భాగంగా వేమూరు నియోజకవర్గం భట్టిప్రోలు మండలం పెసర్లంక గ్రామంలో వైసీపీ నాయకులతో కలిసి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త వరికూటి అశోక్ బాబు పెసర్లంక ఓట్ల జాబితాను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈ సందర్భంగ అశోక బాబు మాట్లాడుతూ. దొంగ ఓట్లను అరికట్టటం లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలన్నారు. వేమూరు నియోజకవర్గంలోని ప్రతి ఒక్కరూ తమ తమ ఓట్లు ఓటరు జాబితాలో మార్పులు చేర్పులు సరి చేసుకోవాలన్నారు. ప్రతి బూత్ లో చనిపోయిన వ్యక్తుల పేర్లను తొలగించే కార్యక్రమాన్ని బూత్ ఏజెంట్లు తీసుకోవాలన్నారు. ఒక మనిషికి వేరు వేరు ప్రాంతాలలో రెండు ఓట్లు కలిగి ఉ ంటారని అలాంటి వారి ఓట్లను పార్టీలు చూడకుండా తొలగించాలని అశోక్ బాబు తెలిపారు బూత్ ఏజెంట్లు ప్రతి ఒక్కరూ భాగస్వాములై దొంగ ఓట్లను అరికట్టడంలో ప్రధాన పాత్ర పోషించాలన్నారు. అదేవిధంగా నూతన ఓటర్ల ను చేర్పించే బాధ్యతను బి ఎల్ వో లు తీసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో భట్టిప్రోలు మండల కన్వీనర్ పడమటి శ్రీనివాసరావు,గ్రామ కమిటీ అధ్యక్షుడు జి రాజు,గ్రామ కమిటీ యూత్ అధ్యక్షులు యన్నం కౌశిక్, నన్నేపాముల నరేష్ , శొంఠి శ్రీనివాసరావు, మేడికొండ నాగబాబు, మండల సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్ నెంబర్ యన్నం కార్తీక్, మేడేపల్లి సురేష్, బోరుగడ్డ బుజ్జి,రెబ్బా అన్నపూర్ణ,రెబ్బా మరియమ్మ,పాల్ దినకరన్ బాబు తదితర నాయకులు పాల్గొన్నారు.

# అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేస్తే చర్యలు తప్పవు

కృష్ణా : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 30:కార్పొరేట్ మాయా జాలం అనుమతులు లేకుండా అడ్మిషన్ లు సి బి ఎస్ ఈ పేరుతో ఆకర్షణ,విద్యార్థుల జీవితాలతో చెలగాటం పేరుతో ప్రజాశక్తి ఎన్ టి ఆర్ కృష్ణా ఉమ్మడి జిల్లా పేజీ లో సోమవారం ప్రచురితమైన వార్తకు కృష్ణాజిల్లా విద్యాశాఖాధికారులు స్పందించారు. కృష్ణాజిల్లా పరిధిలోని కొన్ని ప్రైవేట్ సి బి ఎస్ ఈ / స్టేట్ సిలబస్ పాఠశాలలు సంబంధిత అధికారుల నుండి సరైన గుర్తింపు (=వఏశీస్త్రఅఱఅశీఅ) మరియు అనుమతులు పొందకుండా 2026-27 సంవత్సరానికి అడ్మిషన్లు చేపడుతున్నట్లు జిల్లా విద్యాశాఖా దృష్టికి వచ్చిందని జిల్లా విద్యాశాఖాధికారి యు.వి. సుబ్బారావు తెలిపారు. కృష్ణాజిల్లా పరిధిలో సి బి ఎస్ ఈ / స్టేట్ ఏ విధమైన పాఠ్యాంశం నిర్వహిస్తున్నా, ప్రభుత్వ అనుమతి లేకుండా లేదా చట్టబద్ధ గుర్తింపు (=వఏశీస్త్రఅఱఅశీఅ) లేకుండా పాఠశాలల అడ్మిషన్లు చేపట్టడం ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధం అని . అటువంటి ప్రైవేట్ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించేందుకు తల్లిదండ్రులు ముందుకు రావద్దని, పిల్లలను ప్రైవేటు యాజమాన్యంలోని పాఠశాలలలోజాయిన్ చేసే ముందు తప్పనిసరిగా గుర్తింపు ఉన్న పాఠశాలల వివరాలను సంబంధిత మండల విద్యాశాఖాధికారి, ఉప- విద్యాశాఖాధికారి మరియు జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయాల ద్వారా నిర్ధారించుకుని మాత్రమే అడ్మిషన్లు చేయాలని సూచించారు.

# కొత్తూరి వెంకట సుబ్బారావు కు జాతీయస్థాయిలో బోర్డ్ మెంబర్ స్పైసెస్ బోర్డ్ ఆఫ్ ఇండియా , బోర్డు మెంబర్....




పెన్ పవర్, గుంటూరు, మార్చి, 30. మిత్ర బృందము, వ్యాపార వర్గంలోని ట్రేడర్స్, ఎక్స్పోర్టర్స్, పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన అభినందన సభ స్థానిక కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానం నందు జరిగింది ఈ కార్యక్రమానికి బిజెపి సీనియర్ నాయకులు నేరెళ్ల మాధవరావు అధ్యక్షత వహించి మాట్లాడుతూ.. చిన్నప్పటి నుంచి స్వయంసేవక్ గాను , ఆర్ఎస్ఎస్ ప్రచార గాను, బిజెపి నగర కార్పొరేషన్ అధ్యక్షుడిగాను, ఆ సమయంలోనే ఏడుగురు కార్పొరేట్ గెలిపించుకున్న ఘనత వారికే దక్కిందని, బిజెపి రాష్ట్ర కార్మిక విభాగంలో అధ్యక్షుడిగా ఉన్నప్పుడు, అన్ని జిల్లాల్లో కమిటీలు వేస్తూ యూనియన్ ఏర్పాటు చేసుకొని శక్తివంతమైన కార్మిక విభాగం తయారు చేసుకున్నారని, వారి సేవలను భారతీయ జనతా పార్టీ వ్యవసాయ రంగం మీద మరలచుటకు స్పైసెస్ బోర్డు ఇచ్చారని తెలియజేశారు.

ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నజీర్ అహ్మద్ మాట్లాడుతూ వారు ఎన్నో సంవత్సరాల నుండి భారతీయ జనతా పార్టీ క్రమశిక్షణ లోపలి వారు ఎన్నో సంవత్సరం నుండి పార్టీకి అంకిత పనిచేయటం, పార్టీ వారు సేవను గుర్తించి స్పైసెస్ బోర్డ్ మెంబర్ గా రావడం స్పైసెస్ లో 52 పంటలలో ముఖ్యమైన పంటలలో మిర్చి గుంటూరు నగరానికి గర్వకారణం అని, దేశంలో అతి పెద్దదైన మిర్చి పంటకు స్థానమైన గుంటూరు నుండి అధిక ఎక్స్పోర్ట్ వలన గుంటూరు నగర అభివృద్ధి చెందాలని అది మీ ద్వారా జరగాలని నేను సభాముఖంగా తెలియజేస్తున్నానని చెప్పారు.

జాతీయ మిర్చి ఎక్స్పోర్టర్ కార్యదర్శి తోట రామకృష్ణ మాట్లాడుతూ.. అధికమందు వాడటం వలన మిర్చికి గిరాకీ తగ్గటం, పంటల సారవంతం తగ్గటం, పంట దిగుబడి తగ్గటం వలన క్వాలిటీ మిర్చి రాకపోవటం వలన కూడా ఎక్స్పోర్ట్ లో అనేక ఇబ్బందులు పడుతున్నామని, భవిష్యత్తులో భూమి సారవంతం అయ్యే చర్యలు, టెక్నాలజీ తో పంట కోత విషయంలోనూ మరియు క్వాలిటీ విషయంలోనూ శ్రద్ధ వహించగలిగితే 28% స్పైసెస్ ఎక్స్పోర్ట్ నుండి 40% పెంచుకోగలిగితే గుంటూరు చరిత్రలో ఆర్థికంగా దేశంలో కెల్లా మొదటి స్థానంలో రాగలుగుతుందని తెలియజేశారు.

బిజెపి సీనియర్ నాయకులు జూపూడి రంగరాజు మాట్లాడుతూ.. మా సుబ్బారావు గుంటూరు కార్పొరేషన్ అధ్యక్షుడిగా ఉన్న సమయంలో వారి హయాంలోని ఐదుగురు కార్పొరేటర్లు ఇద్దరు కోఆప్షన్లు గెలిపించుకోగలిగారని.. ఐదుగురులు ఒక కార్పొరేట్ మరణించిన ముగ్గురు కార్పొరేటర్లు స్టేజి మీద ఉండటం, మరొక కార్పొరేటర్ ఆరోగ్యం బాగాలేక రాలేక పోవటం ఇప్పటికీ భారతీయ జనతా పార్టీలో కొనసాగుతున్న సిద్ధాంతపరమైనటువంటి ఈ పార్టీలో కొత్తూరు వెంకట సుబ్బారావు కి ఈ పదవి రావటం మేమంతా గర్వ పడుతున్నామని తెలియజేశారు.

యడ్లపాటి రఘునాథబాబు మాట్లాడుతూ మేమిద్దరం ఒకేసారి జిల్లా అధ్యక్షులుగా ఉన్నప్పుడు పోటీపడి పార్టీని అభివృద్ధి చేశామని అలాంటి సుబ్బారావు కి మీ బాధ్యత రావటం చాలా ఆనందకరమైన విషయం అని తెలియజేశారు.

సన్మాన గ్రహీత అయిన కొత్తూరు వెంకట సుబ్బారావు మాట్లాడుతూ.. లక్ష ఎకరాలు సాగులో గుంటూరు జిల్లాలో దుగ్గిరాలలో ఒక సమయంలో దేశ మొత్తం మీద కొన్ని లక్షల టన్నులు పసుపు ఎక్స్పోర్ట్ జరిగినదని, ఇప్పుడు వారి పండించే పంటకు అతి తక్కువ1.3 ఆయిల్ కంటెంట్ వలన ధర్నా ధర పడిపోయిందని, రాబోయే భవిష్యత్తులో సేలం నుండి గాని నిజాంబాద్ నుంచి సీటును తెప్పించి రైతులకు అవగాహన కల్పించి త్రీ పర్సెంట్ పైన ఆయిల్ కంటెంట్ పెరిగే విధంగా స్పైసెస్ బోర్డులు ఈ విషయం చెప్పి రైతులకు అధిక లాభం కల్పించే విధంగాను దాని వలన వ్యాపారస్తులు మరియు ఇతర ప్రజానీకానికి ఆర్థికమైన లబ్ధి పొందే విధంగా నా వంతు ప్రయత్నం చేస్తానని తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో టుబాకో బోర్డు చైర్మన్ యశ్వంత్, టొబాకో బోర్డు మాజీ చైర్మన్ ఎడ్లపాటి రఘునాథ బాబు, బిజెపి రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి జమ్ముల శ్యామ్ కిషోర్, మిర్చి ఎక్స్పోటర్స్ కొత్తూరి సుధాకర్, జగదీష్ బండారి, ప్రముఖ వ్యాపారస్తులు లీలాధర్ బూబ్, శార్వాణి అధినేత పెద్దిరెడ్డి గోపాల రెడ్డి, బిజెపి కిషన్ వచ్చా రాష్ట్ర అధ్యక్షులు కుమారస్వామి, రాష్ట్ర అధికార ప్రతినిధి బాజీ, బిజెపి రాష్ట్ర ఆఫీసు ఇంచార్జ్, ఏపీ బార్ అసోసియేషన్ సెక్రెటరీ శ్రీనివాసరాజు,బిజెపి జిల్లా అధ్యక్షులు చెరుకూరి తిరుపతిరావు, పల్నాడు బిజెపి జిల్లా అధ్యక్షులు ఏలూరి శశికుమార్, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు ఏల్చూరి వెంకటేశ్వర్లు, ప్రముఖ వ్యాపారస్తులు కొత్తూరి నరసింహారావు , భారత స్టీల్ అధినేత ఏంటి కనిగల్పుల కృష్ణమోహన్, ప్రముఖ ఆడిటర్ టీజేపీ కళాశాల కార్యదర్శి కనికల్పుల వీరబ్రహ్మం, కార్పొరేటర్ బస్సు బాబు, మిర్చి యార్డ్ డైరెక్టర్స్: కె శ్రావణ కుమారి, సత్యం , తదితరులు అభినందించారు...

# తండ్రి మృతి.. ధైర్యంగా పరీక్ష రాసిన విద్యార్థిని



నరసరావుపేట పెన్ పవర్ మార్చి 30: నరసరావుపేటలో హృదయాన్ని కదిలించే సంఘటన పల్నాడు జిల్లాలో చోటుచేసుకుంది. ముప్పాళ్ళ మండలం కుందూరు వారి పాలెం గ్రామానికి చెందిన భావన లక్ష్మి పదవ తరగతి పబ్లిక్ పరీక్షలు రాస్తోంది. ఆదివారం రాత్రి ఆమె తండ్రి అకస్మాత్తుగా మృతి చెందడంతో కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. తండ్రి మరణంతో కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు. ఇలాంటి క్లిష్ట సమయంలో భావన లక్ష్మి తీవ్ర మనోవేదనకు గురైనప్పటికీ తన భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ధైర్యం కోల్పోలేదు. సోమవారం ఉదయం కన్నీళ్లతోనే పరీక్ష కేంద్రానికి వెళ్లి పదవ తరగతి పరీక్షను రాసింది. తండ్రి మృతిచెందిన పరిస్థితుల్లో కూడా పరీక్షకు హాజరై తన పట్టుదల, విద్యపై నిబద్ధతను చాటుకుంది. ఈ ఘటన స్థానికంగా అందరినీ కదిలించింది. భావన లక్ష్మి ధైర్యసాహసాలను గ్రామస్థులు, ఉపాధ్యాయులు ప్రశంసిస్తున్నారు. కష్టసమయంలో కూడా లక్ష్యాన్ని మరవకుండా ముందుకు సాగిన ఈ విద్యార్థికి మంచి భవిష్యత్తు ఉండాలని ఉపాధ్యాయులు స్థానిక పెద్దలు కోరుకుంటున్నారు.

# విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం -- నరసరావుపేటలో కొత్త ఉపకేంద్రానికి శ్రీకారం

## నరసరావుపేట శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవింద బాబు




నరసరావుపేట పెన్ పవర్ మార్చి 30: నరసరావుపేట పట్టణంలోని రావిపాడు రహదారిలో స్వర్గపురి సమీపంలో 24, 25 వార్డు పరిధిలో సుమారు ఐదు కోట్ల రూపాయల వ్యయంతో నిర్మించనున్న 33/11 కిలోవోల్ట్ విద్యుత్ ఉపకేంద్రానికి సోమవారం స్థానిక శాసనసభ్యుడు డాక్టర్ చదలవాడ అరవింద బాబు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించడం మరియు ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడం ప్రభుత్వ లక్ష్యమని అయన తెలిపారు. పట్టణ విస్తరణతో పాటు పెరుగుతున్న విద్యుత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ ఉపకేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ ఉపకేంద్రం అందుబాటులోకి రావడంతో రావిపాడు రహదారి పరిసర ప్రాంతాలైన కాకతీయ నగర్, వల్లపు చెరువు, పాలపాడు, జ్యోతి నికేతన్, రెడ్డి నగర్, బాలయ్య నగర్ ప్రాంతాల్లోని వేలాది కుటుంబాలకు తక్కువ వోల్టేజ్ సమస్యలు తొలగిపోవడంతో పాటు నిరంతరాయంగా నాణ్యమైన విద్యుత్ సరఫరా జరుగుతుందని తెలిపారు. విద్యుత్ చార్జీలు తగ్గించడం,

నిరంతర విద్యుత్ సరఫరా కల్పించడం వంటి అంశాలలో కూటమి ప్రభుత్వం కృషి చేస్తోందని, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల సౌకర్యార్థం మౌలిక వసతుల కల్పనలో ఎక్కడా రాజీ పడబోమని, పనులను నిర్ణీత కాలంలో పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ నాయకులు, వార్డు నాయకులు, విద్యుత్ శాఖ అధికారులు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జగన్ కు క్రెడిట్ చోరీ వ్యాధి అన్నీ తానే చేశానని చెప్పుకుంటున్నాడు. ఎమ్మెల్యే నసీర్...




పెన్ పవర్, గుంటూరు, మార్చి, 30. ఇల్లంటే పునాదులు కాదని, సామాజిక గౌరవం, బిడ్డల భవిష్యత్తు అని గుంటూరు తూర్పు ఎమ్మెల్యే, అసెంబ్లీ మైనారిటీస్ కమిటీ చైర్మన్ నసీర్ అన్నారు. సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా పేదల గృహ ప్రవేశాల కార్యక్రమంలో భాగంగా గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని ఐపీడీ కాలనీలో శారద ఇంటి గృహ ప్రవేశానికి ఎమ్మెల్యే నసీర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. ఎమ్మెల్యే నసీర్ రిబ్బన్ కట్ చేసి శారద కుటుంబానికి ఇంటి తాళాలు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో లక్షల సంఖ్యలో గృహ ప్రవేశాలు జరిగాయని తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వంలో సెంటు భూమి పేరిట పేదలను దగా చేశారన్నారు. రూ.1.80 లక్షలు మాత్రమే ఇచ్చేవారని, దీనికి సీఎం చంద్రబాబు నాయుడు ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రూ.2.50 లక్షలకు పెంచామని తెలిపారు. టిడ్కో ఇళ్ల నిర్మాణానికి సీఎం చంద్రబాబు నాయుడు శ్రీకారం చుడితే.. జగన్ గాలికి వదిలేశారన్నారు.జగన్ క్రెడిట్ చోరీవ్యాధితో బాధపడుతున్నారని, ఎర్రగడ్డ ఆస్పత్రిలో చేర్పించాలని విమర్శించారు. రాజధాని అమరావతివంటి కీలక బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెడితే జగన్అండ్ కో దూరంగా ఉండటం దారుణమని పేర్కొన్నారు. గత ఐదేళ్ల కాలంలో అమరావతి రైతులను, ప్రజలను జగన్ తీవ్రంగా ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. రాష్ట్రంలో ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సీఎం చంద్రబాబు నాయుడు ప్రజలకు మంచి చేయాలనే సంకల్పంతో గృహ నిర్మాణాలు పూర్తి చేశారని చెప్పారు.ఒక వైపు అమరావతి, పోలవరం ప్రాజెక్టులు నిర్మిస్తూనే మరో వైపు సూపర్ సిక్స్ తో పాటు ఇతర సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్న?న్నారని వివరించారు....

# ఐక్యత తో హిందూ ధర్మ రక్షణ కు పాటుపడాలి.



భట్టిప్రోలు, పెన్ పవర్ మార్చి, 30: సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా సమావేశం సోమవారం భట్టిప్రోలు లో జరిగింది. ఈ సందర్భంగా జిల్లా సంస్కృతి ప్రముఖ్ పొన్నపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ మండల కమిటీ సభ్యులు భేదాభిప్రాయాలు లేకుండా ఐక్యత సాధిస్తూ హిందూ ధర్మ రక్షణకు పాటుబడాలన్నారు. ఫిబ్రవరి 2న పౌర్ణమి సందర్భంగా సామూహిక హారతులు,1తేదీ నుండి 5వ తేదీ వరకు మండల సమావేశాలు,11వ తేదీ రెండవ శనివారం సత్సంగం,13,25 తేదీలలో ఏకాదశి నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించాలని తెలియజేశారు. జిల్లా మహిళా కన్వీనర్ బలగాని విజయలక్ష్మి మాట్లాడుతూ 10వ తేదీ నుండి 20 వరకు గ్రామ ధార్మిక సమితి సమావేశాలు నిర్వహించుకోవాలన్నారు. మహిళలు దేవాలయాలలో వారం,వారం భజనలు నిర్వహించాలని బాలవికాస్ శిక్షణ తరగతులు నిర్వహించుకుని వార్షికోత్సవాలు నిర్వహించు కోవడానికి సన్నాహాలు చేసుకోవాలని తెలియజేశారు. వసంత నవరాత్రులు ఘనంగా నిర్వహించిన వారికి,ధర్మనిధి సేకరణలో పాలుపంచుకున్న వారికి ధన్యవాదాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బండారు శ్రీనివాసరావు, వేల్పూరు శ్రీనివాసరావు, జిల్లా ప్రభుత్వ సంబంధాల ప్రముఖ్ బొలగాని వెంకటేశ్వర్లు,జిల్లా ధర్మ ప్రచారక్ జంజనం హేమ శంకరరావు,ధర్మ ప్రచారకులు చింతల మురళీకృష్ణ, దండుప్రోలు వెంకట్రావు,తులసి రాజేష్,మోదడుగు సూరిబాబు,యల్లావుల అంకమ్మరావు యేమినేని శ్రీనివాసరావు,చిట్టా రాముడు, పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ లో ప్రజలు ఇస్తున్న అర్జీలు రీ ఓపెన్ కాకుండ చూసుకోండి..కమిషనర్ కె.మయూర్ అశోక్...




పెన్ పవర్, గుంటూరు, మార్చి, 30. ప్రజలు సంతృప్తి చెందేలా నిర్దేశిత గడువులోగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కమిషనర్ చల్లా ఓబులేసు స్పష్టం చేశారు. సోమవారం నగర కమిషనర్ కె.మయూర్ అశోక్ ఆదేశాల మేరకు కౌన్సిల్ హాల్లో పిజిఆర్ఎస్ ను అదనపు కమిషనర్ నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ పిజిఆర్ఎస్ లో ప్రజలు ఇస్తున్న అర్జీలను సమగ్రంగా పరిష్కారం చేయాలన్నారు. అర్జీలు బియండ్ ఎస్ఎల్ఏ లోకి వెళ్లడానికి వీలులేదన్నారు. క్షేత్ర స్థాయి అధికారులు అర్జీలను నేరుగా వెళ్లి పరిశీలించి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. పిజిఆర్ఎస్ ద్వారా 58 ఫిర్యాదులు అందాయని, పట్టణ ప్రణాళిక విభాగం 17, ఇంజినీరింగ్ విభాగం 22, రెవెన్యూ విభాగం 14, ప్రజారోగ్య విభాగానికి సంబందించి 5 ఫిర్యాదులు అందాయన్నారు. పిజిఆర్ఎస్ లో ప్రజల నుండి అందిన ఆర్జీలను విభాగాల వారిగా విబజించి, సంబంధిత విభాగాదిపతులకి పంపి సమస్యల సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో సిటి ప్లానర్ రాంబాబు, సిఎంఓహెచ్ డాక్టర్ శాంతికళ, యస్.ఈ జి. వెంకటేశ్వరరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు....

# కూటమి ప్రభుత్వం కార్యాలయంలో స్పందన లేదు ప్రజల ఆవేదన.. గ్రామీణ జాతీయ వైద్యుల పార్టీ అధ్యక్షుడు కొండిశెట్టి సురేష్ బాబు...



పెన్ పవర్, విజయవాడ, మార్చి, 30 రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజల సమస్యలు త్వరగా పరిష్కారం అవుతాయని ఆశించిన ప్రజలకు నిరాశ ఎదురవుతోంది. ముఖ్యంగా ప్రభుత్వం కార్యాలయాల్లో సరైన స్పందన లేకపోవడం పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రోజూ వివిధ సమస్యలతో ప్రభుత్వ కార్యాలయాలకు వచ్చే ప్రజలు గంటల తరబడి వేచి ఉన్నా, అధికారులు స్పందించడం లేదని ఆరోపిస్తున్నారు. ఫైళ్ళు పెండింగ్‌లో ఉండిపోవడం, పనులు ఆలస్యం కావడం సాధారణమైపోయిందని ప్రజలు చెబుతున్నారు. మేము చాలా రోజులుగా తిరుగుతున్నాం... కానీ మా సమస్యను ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రభుత్వం మారినా పరిస్థితి మారలేదు. ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యవస్థలు కూడా సక్రమంగా పనిచేయడం లేదని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు ఎక్కువ ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం స్పందించాలని మేము కోరుతున్నాం. లేకపోతే మా సమస్యలు ఎప్పటికీ అలాగే ఉండిపోతాయి." ఈ నేపథ్యంలో ప్రజల సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వివిధ వర్గాలు డిమాండ్ చేస్తున్నాయి. ప్రజల సమస్యలపై ప్రభుత్వం ఎలా స్పందిస్తుందో చూడాలి. ఇప్పటికైనా అధికారులు స్పందించి, ప్రజలకు న్యాయం చేస్తారా అన్నది ఆసక్తికరంగా మారింది...

# కూటమి ప్రభుత్వం లో పేదల కు సేవకులను గుర్తిస్తున్న అధికారులు

సేవే మార్గం సేవే లక్ష్యం గా ముందుకు సాగుతున్న నిజామ్

బాపట్ల నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నిజామ్ కు సేవా పురస్కారం

నిజామ్ చేసిన సేవలకు జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, శాసన సభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ రాజు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందించారు .

గ్రామ స్థాయి నుండి నియోజకవర్గ స్థాయిలో గుర్తింపు పొందిన నిజామ్

లాభాపేక్ష లేకుండా సేవాపేక్ష ముఖ్యంగా ముందడుగు



పిట్టల వాని పాలెం పెన్ పవర్ న్యూస్ కూటమి పాలనలో అభివృద్దే ధ్యేయంగా ముందుకు సాగుతోంది అనేది ప్రతి ఒక్కరికి తెలిసిన అంశం. దీనిలో భాగంగా పేదలకు సేవ చేసిన వారిని గుర్తిస్తూ కూటమి ప్రభుత్వం ప్రజల మన్ననలు పొందుతుంది. చందోలు గ్రామానికి చెందిన గన్ పంతులు కుమారుడు, బాపట్ల నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు నిజామ్ ఎన్నో సంవత్సరాల గా చేసిన సేవలను కూటమి ప్రభుత్వం గుర్తించింది. దీనికి అనుసంధానం గా ప్రభుత్వం రూపుదాల్చిన పి ఫోర్ పథకం ద్వారా కొన్ని కుటుంబాలను ఆయనకు దత్తత ఇచ్చారు. నిజామ్ చేసిన సేవలకు జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్, శాసన సభ్యులు వేగేసిన నరేంద్ర వర్మ రాజు చేతుల మీదుగా ప్రశంసా పత్రం అందించారు. సేవే మార్గం సేవే లక్ష్యం గా ముందుకు సాగడం ఒక శుభపరిణామం అని ప్రశంసల వర్షం కురిపించారు. ప్రతి ఒక్కరు కూడా సేవ చేయటానికి నిజామ్ ని ఆదర్శంగా తీసుకోవాలి అని సూచించారు. నిజామ్ నైజం సేవకు మార్గం అంటూ అభినందనలు కురిపించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, అభిమానులు పాల్గొన్నారు.

# చిలకలూరిపేట బార్ అసోసియేషన్ ఎన్నికలు ముగింపు -- అధ్యక్షుడిగా పి. పురుషోత్తమ రావు విజయం

సెక్రెటరీగా తెల్లబాటి వినయ్ కుమార్ ఘన విజయం -- ప్రశాంతంగా ముగిసిన పోలింగ్



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 30 : చిలకలూరిపేట : స్థానిక బార్ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నికలు ఉత్సాహంగా, ప్రశాంత వాతావరణంలో ముగిశాయి. ఈ ఎన్నికల్లో అధ్యక్ష పదవికి జరిగిన పోటీలో పోలూరి పురుషోత్తమ రావు విజయం సాధించారు. మొత్తం 116 ఓట్లు పోలింగ్ జరగగా, పురుషోత్తమ రావుకు 58 ఓట్లు లభించాయి. ఆయన తన సమీప ప్రత్యర్థి పి. శ్రీనివాసరావు (44 ఓట్లు)పై 14 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. మరో అభ్యర్థి టి. రామనారాయణకు 12 ఓట్లు రాగా, 2 ఓట్లు నోటా కు పడ్డాయి. సెక్రెటరీ పదవికి జరిగిన ఎన్నికల్లో తెల్లబాటి వినయ్ కుమార్ స్పష్టమైన ఆధిక్యంతో విజయం సాధించారు. వినయ్ కుమార్‌కు 77 ఓట్లు లభించగా, ఆయన ప్రత్యర్థి రాజ్‌కుమార్‌కు 39 ఓట్లు మాత్రమే వచ్చాయి.

దీంతో 58 ఓట్ల భారీ మెజారిటీతో వినయ్ కుమార్ సెక్రెటరీగా ఎన్నికయ్యారు. మొత్తం 122 ఓట్లకు గాను 116 ఓట్లు పోలింగ్ జరగడం గమనార్హం. నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు తోటి న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

# విజయవంతంగా పి -ఫోర్ ప్రథమ వార్షికోత్సవం







అమృతలూరు (భట్టిప్రోలు) పెన్ పవర్ మార్చి, 30: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న జీరో ప్రావర్టీ పీ-4" కార్యక్రమం విజయవంతంగా ఒక సంవత్సరం పూర్తి చేసుకున్నట్లు మాజీ మంత్రి వేమూరు శాసనసభ్యులు నక్కా ఆనందబాబు అన్నారు. అమృతలూరు మండలంలో ఘనంగా ప్రథమ వార్షికోత్సవ వేడుకలు సోమవారం నిర్వహించ బడ్డాయి. ఈ కార్యక్రమానికి వేమూరు శాసనసభ సభ్యులు మరియు మాజీ మంత్రి వర్యులు నక్కా ఆనంద బాబు ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి దూరదృష్టితో ప్రారంభమైన పి-4 కార్యక్రమం,2029 నాటికి ఆంధ్రప్రదేశ్‌ను పేదరిక రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దడం అనే మహత్తర లక్ష్యంతో ముందుకు సాగుతోందన్నారు.ఈ కార్యక్రమం "స్వర్ణాంధ్ర విజన్ 2047లో భాగంగా సమగ్ర అభివృద్ధి లక్ష్యాలను సాధించేందుకు రూపుదిద్దుకుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఈ పథకంలో అత్యంత పేద కుటుంబాలను "బంగారు కుటుంబాలు"గా, వారికి అండగా నిలిచే దాతలు,సేవాభావం కలిగిన వ్యక్తులు, సంస్థలను మార్గదర్శులుగా గుర్తించి, సమాజంలోని ఆర్థికంగా బలమైన వర్గాలు వెనుకబడిన కుటుంబాలకు విద్య, ఆరోగ్యం,ఉపాధి, నైపుణ్యాభివృద్ధి, స్వయం ఉపాధి,చిన్న వ్యాపారాలు వంటి రంగాల్లో తోడ్పాటు అందిస్తున్నాయన్నారు.ఈ సహకారంతో ఆ కుటుంబాలను స్వయం సమృద్ధి దిశగా తీసుకెళ్లే సామాజిక ఉద్యమంగా పి-4 రూపుదిద్దుకుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన మార్గదర్శులు, స్వచ్ఛంద సంస్థలు, అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామ నాయకులు మరియు ప్రతి భాగస్వామికి నక్కా ఆనంద బాబు హృదయపూర్వక అభినందనలు తెలిపారు.

# నరసరావుపేట నియోజకవర్గంలో పండుగలా సామూహిక గృహప్రవేశాలు

ఉప్పలపాడు ఎన్టీఆర్ కాలనీలో లబ్ధిదారులకు ఇళ్ల తాళాలు అందజేసిన ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు

యల్లమంద గ్రామంలో సీఎం హామీ నెరవేర్పు - త్వరలోనే ఇళ్లకు నిధుల మంజూరు







నరసరావుపేట పెన్ పవర్ మార్చి 30: పేదవాడి సొంతింటి కలను నిజం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు పేర్కొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సామూహిక గృహప్రవేశాల కార్యక్రమంలో భాగంగా, సోమవారం నరసరావుపేట నియోజకవర్గ పరిధిలోని ఉప్పలపాడు మరియు ఎలమంద గ్రామాల్లో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఉప్పలపాడు గ్రామ పరిధిలోని ఎన్టీఆర్ కాలనీ లేఅవుట్ లో నూతనంగా నిర్మించిన గృహాలకు ఎమ్మెల్యే రిబ్బన్ కట్ చేసి, ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని సామూహిక గృహప్రవేశాలు చేయించారు. అనంతరం లబ్ధిదారులకు ఇళ్ల తాళాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చదలవాడ అరవింద బాబు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా నిర్మించిన 2.50 లక్షల ఇళ్లలో భాగంగా నేడు ఉప్పలపాడు లబ్ధిదారులకు సొంతింటి కల నెరవేరడం సంతోషంగా ఉందన్నారు. ఎన్టీఆర్ కాలనీలో విద్యుత్, త్రాగునీరు, రోడ్ల వంటి అన్ని మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, రాజకీయాలకు అతీతంగా పారదర్శక పాలన అందిస్తున్నామని స్పష్టం చేశారు. అనంతరం యల్లమంద గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే గతంలో ముఖ్యమంత్రి వర్యులు ఇచ్చిన హామీని గుర్తు చేశారు. యల్లమంద లో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు త్వరలోనే నిధులు (అమౌంట్) శాంక్షన్ చేస్తామని హౌసింగ్ డి.ఇ (డి.ఇ )తో కలిసి హామీ ఇచ్చారు. స్వయంకృషితో ఇళ్లు నిర్మించుకున్న లబ్ధిదారులను అభినందిస్తూ, నియోజకవర్గంలో అర్హులైన ప్రతి పేదవాడికి పక్కా గృహం అందేలా చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ కార్పొరేషన్ డి.ఇ, ఏ.ఈలు, రెవెన్యూ సిబ్బంది, ఉప్పలపాడు గ్రామ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు. తమ చిరకాల వాంఛ నెరవేరినందుకు లబ్ధిదారులు ఎమ్మెల్యేకి, ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలియజేశారు.

# స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులను అడ్డగోలుగా కాజేసిన దొంగవు

ప్రత్తిపాటిపై విమర్శలు చేస్తే సహించేది లేదు.....టీడీపీ మైనారిటీ నేతల హెచ్చరిక



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 30 : చిలకలూరిపేట: స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నిధులను అడ్డగోలుగా కాజేసిన అవినీతిపరులకు, మాజీ మంత్రి మరియు ప్రస్తుత ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ని విమర్శించే నైతిక అర్హత లేదని తెలుగుదేశం పార్టీ మైనారిటీ నేతలు తీవ్రంగా మండిపడ్డారు. ఆదివారం మురికిపూడి గ్రామంలో జరిగిన తిరునాళ్ల సందర్భంగా షేక్ జాన్ సైదా చేసిన వ్యాఖ్యలపై వారు పత్రికా సమావేశంలో ధ్వజమెత్తారు.

అవినీతి సొమ్ముతో పాప ప్రక్షాళన చేయలేవు

గత ప్రభుత్వ హయాంలో కొందరు అవినీతి ఉన్నతాధికారులను అడ్డుపెట్టుకుని, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ముసుగులో వందల కోట్ల రూపాయల ప్రజా ధనాన్ని షేక్ జాన్ సైదా కాజేశారని నేతలు ఆరోపించారు. అలా సంపాదించిన అవినీతి సొమ్ముతో పది మందికి సాయం చేసినంత మాత్రాన చేసిన పాపాలు పోవని, అది కేవలం "పాప ప్రక్షాళన" డ్రామా మాత్రమేనని వారు ఎద్దేవా చేశారు.

బినామీ బతుకు నీది.. చిల్లర మాటలు కట్టిపెట్టు

పెద్ద పెద్ద అవినీతి అధికారులకు బినామీగా ఉండి, వారు విసిరేసిన చిల్లర కోసం పాకులాడే వ్యక్తి ప్రత్తిపాటి వంటి సీనియర్ నాయకుడి గురించి మాట్లాడటం హాస్యాస్పదమని నేతలు పేర్కొన్నారు. "నువ్వు చేస్తున్న అవినీతి బాగోతం నియోజకవర్గంలో ప్రతి ఒక్కరికీ తెలుసు. కేవలం గుర్తింపు కోసం ఇలాంటి చౌకబారు వ్యాఖ్యలు చేస్తే మరింత దిగజారిపోతావు" అని వారు హెచ్చరించారు.

ముందు బాకీలు తీర్చు.. ఆపై మాట్లాడు

మూడు దశాబ్దాలుగా నియోజకవర్గ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తున్న నాయకుడు ప్రత్తిపాటి అని, కనీసం తన పార్టీ అధినాయకుడి అపాయింట్‌మెంట్ కూడా దొరకని జాన్ సైదా ఆయన గురించి మాట్లాడటం విడ్డూరంగా ఉందన్నారు. "నీకు రాజకీయాల కంటే ముందు బాకీలు తీర్చడం ముఖ్యం. నెల్లూరు, బీహార్‌కు చెందిన వ్యాపారస్తులకు నువ్వు ఇవ్వాల్సిన డబ్బులు ముందుగా చెల్లించు" అని మైనారిటీ నేతలు చురకలు అంటించారు.

క్షమాపణ చెప్పాలని డిమాండ్

ప్రత్తిపాటి పుల్లారావు పై చేసిన అనుచిత వ్యాఖ్యలను వెంటనే వెనక్కు తీసుకోవాలని, పత్రికా ముఖంగా క్షమాపణ చెప్పాలని టీడీపీ మైనారిటీ నేతలు డిమాండ్ చేశారు. మరోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే ప్రజలే తగిన బుద్ధి చెబుతారని, తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వారు హెచ్చరించారు.

# కాలేజ్ బస్సును ఢీకొట్టిన ఇన్నోవా.. విద్యార్థులు సురక్షితం




చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 30 : చిలకలూరిపేట : మండల పరిధిలోని పసుమర్తి సమీపంలో నూతన జాతీయ రహదారిపై సోమవారం ఉదయం పెను ప్రమాదం తృటిలో తప్పింది.ఈశ్వర్ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన బస్సును ఒక ఇన్నోవా వాహనం బలంగా ఢీకొట్టింది.కళాశాల బస్సు ఎప్పటిలాగే ఇంకొల్లు నుండి నరసరావుపేట వైపు విద్యార్థులతో వెళ్తుండగా,పసుమర్తి వద్ద ఈ ప్రమాదం చోటు చేసుకుంది.వేగంగా వచ్చిన ఇన్నోవా వాహనం నియంత్రణ కోల్పోయి బస్సును ఢీకొట్టింది.ప్రమాద సమయంలో బస్సులో ఎనిమిది మంది విద్యార్థులు ఉ న్నట్లుసమాచారం. ఈ ప్రమాదంలో బస్సు స్వల్పంగా దెబ్బతిన్నప్పటికీ, విద్యార్థులందరూ ఎటువంటి గాయాలు లేకుండా సురక్షితంగా బయటపడటంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. విద్యార్థులకు ఎటువంటి ప్రమాదం జరగలేదని కళాశాలయాజమాన్యం అధికారికంగా ధృవీకరించింది.ప్రమాదం జరిగిన వెంటనే స్పందించిన

కాలేజీయాజమాన్యం,ఘటనా స్థలానికి మరో బస్సును పంపించి విద్యార్థులను సురక్షితంగా కళాశాలకు తరలించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలు మరియు ఇతర వివరాలు తెలియాల్సి ఉంది.

# కులం పేరుతో దూషించిన నిందితుడు అరెస్ట్



తెనాలి (గుంటూరు) : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 30: కులం పేరుతో దూషించి ఓ సామాజిక వర్గం ఆందోళనకు కారణమైన నిందితుడిని రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. రూరల్ సర్కిల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో డిఎస్పి బి.జనార్ధనరావు కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. రూరల్ గ్రామం కొలకలూరు ఎస్సీ కాలనీకి చెందిన బుల్లా వివేక్ ఈనెల 27న తన భార్యతో కలిసి బైక్ పై వెళుతుండగా గ్రామంలోని కాజీపేట శివారు చెరువు వద్ద పశువుల మంద అడ్డుగా వచ్చింది. రోడ్డు పక్కకు బైకును నిలిపే క్రమంలో అక్కడే మద్యం మత్తులో ఉన్న ఖాజీపేట గ్రామానికి చెందిన చల్లా నాగరాజు జోక్యం చేసుకొని, అకారణంగా వివేక్ ను దూషించడమే కాకుండా అతని భార్యను కూడా దూషించాడు. అంతటితో ఊరుకోకుండా కొలకలూరు కూడలి లోని బాబు జగజ్జీవన్ రామ్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాల వద్దకు చేరిన నాగరాజు ఫేస్బుక్ లైవ్ లో మాల మాదిగ సామాజిక వర్గాలను దూషించాడు. అదీ చాలదన్నట్లు ఇంటికి వెళ్లి తీరికగా ఎస్సీ సామాజిక వర్గాన్ని బూతులు తిడుతూ మరో వీడియో ఫేస్బుక్ లో అప్లోడ్ చేశాడు. దీనిపై బాధితుడు, కుల సంఘాల ప్రతినిధులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో నిందితుడిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ తో పాటు మరికొన్ని సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. అంతేకాకుండా ఈనెల 28న గ్రామ ప్రధాన కూడలిలో నిందితుడిని తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ కుల సంఘాలు రాస్తారోకో చేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో డి.ఎస్.పి ఆధ్వర్యంలో దర్యాప్తు చేసిన రూరల్ సీఐ నాయబ్ రసూల్, ఎస్సై కె ఆనంద్ నందివెలుగు కూడలిలో నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. అతనిని కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు చెప్పారు. తదుపరి అతనిపై రౌడీషట్ కూడా ఓపెన్ చేయనున్నట్లు చెప్పారు. కులాల మధ్య చిచ్చుపెట్టే విధంగా ఎవరు వ్యవహరించినా ఉపేక్షించేది లేదని డిఎస్పి హెచ్చరించారు.

# పేదరిక నిర్మూలనే ధ్యేయం

## జీరో పావర్టీ - పి4 పథకం ప్రథమ వార్షికోత్సవంలో ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు







నరసరావుపేట పెన్ పవర్ మార్చి 30: సమాజంలో అత్యంత వెనుకబడిన, ఎటువంటి ఆస్తిపాస్తులు లేని పేద కుటుంబాలను గుర్తించి, వారిని ఆర్థికంగా నిలబెట్టడమే పి4 (పూర్ టూ ప్రోగ్రెస్సివే అండ్ ప్రాస్పరస్ ) కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని నరసరావుపేట శాసనసభ్యులు డాక్టర్ చదలవాడ అరవింద బాబు కొనియాడారు. సోమవారం స్థానిక జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన జీరో పావర్టీ - పి4 పథకం ప్రథమ వార్షికోత్సవ వేడుకలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొని, గత ఏడాది కాలంగా ఈ పథకం సాధించిన విజయాలను అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గౌరవనీయులు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల ప్రత్యేక చొరవతో ఈ పథకం ద్వారా ఎంతో మంది లబ్ధి పొందడం హర్షణీయమని, పేదల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యమని అయన పేర్కొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి పేదవాడి గడపకు చేరాలని, అధికారులు మరియు ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేసి నరసరావుపేటను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దాలని ఆయన పిలుపునిచ్చారు. భవిష్యత్తులో ఈ పథకం ద్వారా మరిన్ని కుటుంబాలకు ఉపాధి కల్పించి, వారి జీవితాల్లో వెలుగులు నింపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా నరసరావుపేటలో పి4 కింద స్వచ్ఛందంగా సేవలు అందిస్తూ పేదలకు అండగా నిలిచిన పలువురు ప్రముఖులకు ఉత్తమ, విశిష్ట మార్గదర్శి పురస్కారాలను, ప్రశంసా పత్రాలను అందజేశారు. పురస్కారాలు అందుకున్న ప్రముఖులు, కోట లక్ష్మణ్ (మురళి పెయింట్స్ అధినేత), రామ శేషగిరిరావు (ఎం.ఏ.ఎం కళాశాల చైర్మన్), వడ్లమూడి కిషోర్, నల్లపాటి శివ, ఈ కార్యక్రమంలో కపలవాయి విజయ్ కుమార్, ఆర్డీవో బాలకృష్ణ, ఇతర ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు, పి4 సిబ్బంది మరియు లబ్ధిదారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# పేదరికం లేని రాష్ట్రాన్ని నిర్మించాలన్న చంద్రబాబు ఆలోచనలో పీ-4 తొలి అడుగు : ప్రత్తిపాటి

## వెనుకబడిన వర్గాలకు ఆర్థిక, సామాజిక చేయూత అందించాలన్నదే పీ-4 పథకం ప్రధానోద్దేశం.
## బంగారు కుటుంబాలకు అండగా నిలిచిన మార్గదర్శుల్ని సన్మానించిన ప్రత్తిపాటి.
## పీ-4 పథకం తొలి వార్షికోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న ప్రత్తిపాటి.



చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 30 : చిలకలూరిపేట : ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన పేద, మధ్య తరగతి వర్గాలను గుర్తించి, వారికి చేయూత నివ్వాలన్నదే పీ-4 లక్ష్యమని, పేదరికం లేని రాష్ట్రాన్ని తీర్చిదిద్దాలన్నదే చంద్రబాబు ప్రధాన ఆలోచన అని, దానిలో పీ-4 తొలి అడుగని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాట పుల్లారావు తెలిపారు. కూటమి ప్రభుత్వ ప్రతిష్ఠాత్మక ఆలోచన అయిన పీ-4 పథకం ప్రారంభించి ఏడాది పూర్తి అయిన సందర్భాన్ని (తొలి వార్షికోత్సవం) పురస్కరించుకొని స్థానిక మున్సిపల్ టౌన్ హాల్లో ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రత్తిపాటి మాట్లాడారు. పీ4 పథకం కింద ఎంపికైన బంగారు కుటుంబ లబ్ధిదారులు, మార్గదర్శులతో ప్రత్యేకంగా ప్రత్తిపాటి మాట్లాడారు. అనంతరం మార్గదర్శులకు ప్రభుత్వ ప్రశంసా పత్రాలు అందించి, వారిని సన్మానించారు. పారిశ్రామికవేత్తలు, ధనవంతులు మోదీ, చంద్రబాబు లక్ష్య సాధనలో భాగస్వాములు కావాలి పేదల జీవితాల్లో వెలుగులు, సంతోషాలు నింపాలనే ఆలోచనపై ప్రతి ఒక్కరూ దృష్టి సారించాలని, ముఖ్యంగా పారిశ్రామికవేత్తలు, ధనవంతులు ప్రధాని మోదీ లక్ష్యమైన వికసిత్ భారత్, ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ 2047లో భాగస్వాములు కావాలని ప్రత్తిపాటి పిలుపునిచ్చారు. ప్రకృతి విపత్తులు, అనుకోని విపత్కర పరిస్థితుల్లో పేదలకు అండగా నిలిచే పలు సంస్థలు, వ్యక్తులు చిలకలూరిపేటలో ఉండటం నిజంగా నియోజకవర్గానికే గర్వకారణమని ప్రత్తిపాటి చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, సన్మాన గ్రహీతలు నియోజకవర్గ ప్రత్యేక అధికారి కే.మాధవి, సిబిఐపీయు మహమ్మద్ అలీ, నాగండ్ల రాంబాబు, జాష్టి కృష్ణమోహన్, దుమాల జ్యోతి, తోట శ్రీరాములు, మల్లవరపు బాలకిషోర్ రాజు, వజ్జ సింగయ్య, షేక్ ఖాజా హుస్సేన్, షేక్ సుభాని, జానీ భాష, ఎంపీడీవోలు, టీడీపీ నాయకులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.




# ఆస్తి వివాదం -- యాసిడ్ దాడి -- వృద్ధుడి పరిస్థితి విషమం



పొన్నూరు (గుంటూరు) : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 30: గుంటూరు జిల్లా, పొన్నూరు మండలం చింతలపూడి గ్రామంలో బంధువుల మధ్య ఆస్తి వివాదం నెలకొంది. కోడూరు శ్రీనివాసరావు (65) అనే వృద్ధుడి పై చింతలపూడి గ్రామానికి చెందిన మారుపూడి సుబ్బయ్య (65) అనే మరో వృద్ధుడు యాసిడ్ తో దాడి చేశాడు. అడ్డుకోబోయిన మరో ఇద్దరి వ్యక్తులపై కూడా యాసిడ్ పడింది. యాసిడ్ దాడి బాధితులను వెంటనే చికిత్స నిమిత్తం పొన్నూరు ప్రైవేట్ హాస్పిట్ కి తరలించారు. ప్రస్తుతం కోడూరు శ్రీనివాసరావు పరిస్థితి విషమంగా ఉంది. యాసిడ్ బాధితులను పునాటి రాంబాబు, హనీఫ్‌లుగా గుర్తించారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పొన్నూరు రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# రైతుల ఆర్థిక బలోపేతానికి.. పశుపోషణే కీలక ఆదాయ వనరు : ప్రత్తిపాటి

## గేదెలు అనారోగ్యానికి గురైతే పాల దిగుబడి తగ్గుతుంది
## పశుపోషణకు ప్రభుత్వం అందించే రాయితీలను రైతాంగం సద్వినియోగం చేసుకోవాలి
## మానుకొండవారిపాలెంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రారంభించిన ప్రత్తిపాటి.
## ప్రభుత్వం అందించే ఉచిత పశువైద్యసేవలు, పశుపోషణ రాయితీలు, ప్రోత్సాహకాల్ని రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు.





చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 30 : చిలకలూరిపేట: మానుకొండవారిపాలెంలో పశుసంవర్ధక మరియు వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఉచిత పశువైద్య శిబిరాన్ని ప్రత్తిపాటి ప్రారంభించి, రైతుల్ని, గ్రామస్తుల్ని ఉద్దేశించి మాట్లాడారు. పశువులకు గాలికుంటు, గొంతువాపు వ్యాధి టీకాలు, గొర్రెలకు నాచు, నీలినాలుక వ్యాధి టీకాలను పశుసంవర్ధక శాఖ యంత్రాంగం ఉచితంగా వేస్తోందన్నారు. నట్టల నివారణ మందులతో పాటు, పశువులను పరీక్షించి అవసరమైన అన్నిరకాల మందుల్ని ఉచితంగా అందిస్తున్నారని చెప్పారు. గేదెలు, ఆవులు అనారోగ్యానికి గురైతే పాల దిగుబడి తగ్గుతుందన్నారు. గత ప్రభుత్వం ఇష్టానుసారం, స్వార్థ ప్రయోజనాలకోసం మున్సిపాలిటీలో కలిపిన గ్రామాలను మరలా పంచాయతీలుగా పరిగణించబోతున్నామని ప్రత్తిపాటి చెప్పారు. గ్రామస్తుల కోరిక మేరకే ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలిపారు. ఈ కార్యక్రమంలో టిడిపి సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్ మోహన్, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, కల్లి వీర రెడ్డి, పశు వైద్యులు డాక్టర్ రాధాకృష్ణ, నాగేశ్వరరావు , దీప్తి, గ్రామ నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# జగన్ కల్లగా మార్చిన పేదల కలను చంద్రబాబు నిజం చేశారు : ప్రత్తిపాటి

## టీడీపీ హాయాంలో నిర్మించిన ఇళ్లకు రంగులేసి, లబ్ధిదారులకు తలనొప్పులు సృష్టించిన జగన్ నిర్వాకంతో పేదలు ఇబ్బందులు పడ్డారు
## పట్టణ శివారల్లో 52 ఎకరాల సముదాయంలో నిర్మించిన టిడ్కో గృహ ప్రవేశ కార్యక్రమంలో పాల్గొన్న మాజీమంత్రి
## ఇళ్లు పొందిన లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందించి, గృహ ప్రవేశాలు చేయించిన ప్రత్తిపాటి
## టిడ్కో గృమ సముదాయాన్ని మినీసిటీగా మారుస్తాం : ప్రత్తిపాటి
## ఇప్పటికే రూ.11.79 కోట్లతో విద్య, వైద్య భవనాలు, దుకాణ సముదాయాలు, ఇతర మౌలిక వసతుల కల్పన పనుల నిర్మాణం చేపట్టాం : ప్రత్తిపాటి













చిలకలూరిపేట రూరల్, పెన్ పవర్, మార్చి 30 : చిలకలూరిపేట : లక్షలాది పేదల సొంతింటికలను నేడు కూటమిప్రభుత్వం సాకారం చేసిందని, 2.50 లక్షల ఇళ్లల్లో వెలుగులు నింపిందని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. సోమవారం పట్టణ శివార్లలోని 52 ఎకరాల సముదాయంలో ఫేజ్-2లో నిర్మించిన 1008 టిడ్కో ఇళ్లల్లో కొన్నింటిని లబ్ధిదారులు, కూటమి నాయకులతో కలిసి ప్రారంభించారు. లబ్ధిదారులకు నూతన వస్త్రాలు అందించి, వారితో గృహ ప్రవేశాలు చేయించిన అనంతరం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు.

టీడీపీ హాయాంలో 90శాతం పూర్తయిన ఇళ్లను జగన్ పాడుపెట్టాడు

2014-19లో టీడీపీ ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా పేదలకోసం నిర్మించిన, 90 శాతం వరకు పూర్తయిన ఇళ్లను జగన్ అధికారంలోకి పాడుపెట్టాడన్నారు. కేవలం కొన్ని చోట్ల రంగులు వేయించి, టీడీపీ హాయాంలో ఇళ్లు పొందిన లబ్ధిదారుల్ని కాదని, ఇతరులకు వాటికి కేటాయించి తలనొప్పులు సృష్టించి, ఆర్భాటంగా అంతా తానే చేసినట్టు ప్రచారం చేసుకున్నాడని ప్రత్తిపాటి పేర్కొన్నారు. కూటమిప్రభుత్వం ఏర్పడ్డాక ఈ 22 నెలల్లోనే 5లక్షల ఇళ్లను సకల హంగులతో లబ్ధిదారులకు అప్పగించిందన్నారు. చిలకలూరిపేటలో గతంలో 4,512 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించినట్టు ప్రత్తిపాటి చెప్పారు. వైసీపీ ప్రభుత్వం మిగిలిన ఇళ్లల్లో ఒక్కశాతం పనులు కూడా పూర్తిచేయకుండా లబ్ధిదారులకు వడ్డీల భారం పెంచితే, కూటమి ప్రభుత్వం వచ్చాక అన్నింటినీ పూర్తిచేసి, పేదల సొంతింటి కలను సాకారం చేసిందన్నారు. నేడు ఫేజ్-2 లో పూర్తిచేసిన ఇళ్లను లబ్ధిదారులకు అప్పగించామన్నారు. ఇళ్లు ఖాళీగా ఉంటే ఊరుకోబోమని లబ్ధిదారులకు స్పష్టం చేశామన్నారు. గృహాలు పొందిన వారంతా తప్పకుండా ఇళ్లల్లో ఉండాల్సిందేనని, ఉండటానికి వీలుపడని వారు మాత్రమే అద్దెలకు ఇవ్వాలని చెప్పామన్నారు. ఎవరైతే కచ్చితంగా ఇళ్లల్లో ఉంటారో వారికే ఇకపై ఇళ్లు కేటాయిస్తామని, దానిలో ఎలాంటి మినహాయింపు ఉండబోదని ప్రత్తిపాటి తేల్చిచెప్పారు. విడిగా మద్ది నగర్లో ప్రభుత్వ పథకాల కింద ఇళ్లు నిర్మించుకున్నవారితో కూడా గృహ ప్రవేశాలు చేయించినట్టు ప్రత్తిపాటి చెప్పారు.

టిడ్కో గృహ సముదాయాన్ని మినిసిటీగా అభివృద్ధి చేస్తాం..

పట్టణంలోని పేదలకోసం రెండోదశలో నిర్మించిన 1008 టిడ్కో ఇళ్లలో కొన్నింటిని నేడు లబ్ధిదారులకు అప్పగించామన్న ప్రత్తిపాటి.. రెండునెలల్లో అన్నింటినీ పూర్తిచేస్తామన్నారు. టిడ్కో గృహ సముదాయాల్లోనే దుకాణ సముదాయాలు, ప్రార్థనా మందిరాలు, శ్మశాన వాటికలు సహా అన్నిరకాల వసతులు కల్పిస్తున్నామని, వాటికి సంబంధించిన పనులు చురుగ్గా జరుగుతున్నాయని ప్రత్తిపాటి తెలిపారు. టిడ్కో గృహాల్లో ఉండేవారు కమిటీలుగా ఏర్పడితే, దశలవారీగా అన్ని సౌకర్యాలు ఒనగూరుతాయన్నారు. టిడ్కో గృహ సముదాయాన్ని మినిసిటీగా తీర్చిదిద్దుతామని ప్రత్తిపాటి హామీ ఇచ్చారు. ఇప్పటికే రూ.11.79 కోట్లతో ప్రార్థనా మందిరాలు, దుకాణసముదాయాలు, విద్య, వైద్య భవనాలు నిర్మాణం చేపట్టినట్టు ఆయన చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మున్సిపల్ మాజీ చైర్మన్ షేక్ రఫాని, పట్టణ అధ్యక్షులు పఠాన్ సమాధ్ ఖాన్, మండల అధ్యక్షులు జవ్వాజి మధన్, బీజేపీ నాయకులు మల్లెల శివనాగేశ్వరరావు, టీడీపీ పట్టణ ప్రధాన కార్యదర్శి మద్దుమాల రవి, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు కొత్త కోటేశ్వరరావు, ముల్లా కరీముల్లా , షేక్ మస్తాన్ వలి, బేరింగ్ మౌలాలి మెప్మా పిడి, మున్సిపల్ డీఈ అబ్దుల్ రహీమ్, షాపుజి పల్లంజి అధికారులు, మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు, టీడీపీ, కూటమి నాయకులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# రామయ్యకు నవనీత కృష్ణాలంకారం

ఒంటిమిట్ట : పెన్ పవర్ ప్రతినిధి మార్చి 30:ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం రాములవారికి నవనీత కృష్ణాలంకారం చేశారు.. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, చెక్కభజనలు, కోలాటాలతో, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా నిర్వహించారు. యాత్రికులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఇఒ ప్రశాంతి, సూపరింటెండెంట్ హనుమంతయ్య, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్ పాల్గొన్నారు. రాత్రి 7 గంటల నుంచి 9 గంటల వరకు హనుమంత వాహనంపై కోదండరాముడిని ఊరేగించారు.

రాములోరి కల్యాణానికి పటిష్ట ఏర్పాట్లు : జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్ సవిత

ఒంటిమిట్ట శ్రీ కోదండరామ స్వామి కల్యాణాన్ని నిర్వహించేందుకు అందరూ కలిసి బాధ్యతయుతంగా పనిచేసే విజయవంతం చేయాలని జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి ఎస్ సవిత పేర్కొన్నారు. సోమవారం కల్యాణ వేదిక వద్ద ఏర్పాట్లను కలెక్టర్ శ్రీధర్, టిటిడి జెఇఒ వి వీరబ్రహ్మంతో కలిసి ఆమె పరిశీలించారు. అనంతరం టిటిడి అతిథి గృహంలో అధికారులతో నిర్వహించిన సమావేశంలో మంత్రి సవిత మాట్లాడుతూ రెండవ తేదీన జరిగే రాములవారి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

# సిక్కోలులో దువ్వాడ రాజకీయం

**శ్రీకాకుళం, మార్చి 30,పెన్ పవర్ :**
: శ్రీకాకుళం జిల్లా రాజకీయాలు చాలా విచిత్రంగా ఉంటాయి. దశాబ్దాలుగా ఇక్కడ రాజకీయం కింజరాపు వర్సెస్ ధర్మాన ఫ్యామిలీ అన్నట్టు ఉంటుంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధర్మాన.. టిడిపి అధికారంలోకి వస్తే కింజరాపు కుటుంబాల హవా ఉంటుంది. అదే చాలామంది రాజకీయ పార్టీల నేతలకు మింగుడు పడని విషయం. ఇప్పుడు అటువంటి సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు దువ్వాడ శ్రీనివాస్. ఆ రెండు కుటుంబాల మధ్య రాజకీయ అనైతిక బంధం కొనసాగుతోందని ఆయన చెబుతున్నారు. గత కొద్ది కాలంగా ఇదే విషయాన్ని పదేపదే హెచ్చరిస్తూ వచ్చారు. ఇప్పుడు ఏకంగా ఆ రెండు కుటుంబాలకు గట్టి వార్నింగ్ ఇస్తున్నారు. దువ్వాడ శ్రీనివాస్ కు నేరుగా రాజకీయ ప్రత్యర్థి కింజరాపు ఫ్యామిలీ కాగా.. ఒకే పార్టీలో ప్రత్యర్థులు ధర్మాన సోదరులు. ప్రస్తుతం వ్యక్తిగత కుటుంబ వ్యవహారాలతో వైసిపి సస్పెన్షన్ వేటులో ఉన్నారు దువ్వాడ శ్రీనివాస్. అయితే వైసీపీలో తన సస్పెన్షన్ కు ధర్మాన, కింజరాపు కుటుంబాలే కారణమని కోపంతో రగిలిపోతున్నారు.అయితే దువ్వాడ శ్రీనివాస్ మాత్రం విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తన మనసునిండా జగన్మోహన్ రెడ్డి ఉన్నారని చెబుతున్నారు. అదే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి ధర్మాన సోదరులు తనను సస్పెండ్ చేయించారని చెప్పుకొస్తున్నారు. అయినా సరే పార్టీలోకి వస్తానని తేల్చి చెప్తున్నారు.
జగన్ మాత్రం ఏం సినిమా హీరో అనుకుంటున్నావా అని వ్యంగ్యంగా అడుగుతున్నారు. అదే సమయంలో కింజరాపు కుటుంబం పై కూడా నోరు పారేసుకుంటున్నారు. నా వెంట్రుక కూడా పీకలేరు అంటూ బాబాయ్ అబ్బాయిలను హెచ్చరిస్తున్నారు. తను చెప్పాలనుకున్నది చెబుతున్న దువ్వాడ శ్రీనివాస్ మాటను ఎవరు వినే పరిస్థితిలో లేరు. జగన్ పై అభిమానం కొండంత ఉంది. కానీ వైసీపీలో చోటు లేదు. ధర్మాన కుటుంబం పార్టీని నాశనం చేసిందని చెబుతున్నారు. కానీ వారు లేకుండా ఇప్పుడు జిల్లాలో పార్టీ లేదు. కింజరాపు ఫ్యామిలీ ఏం చేయలేదని చెబుతున్నారు. కానీ జిల్లాలో ఆ కుటుంబానికి మంచి ఆదరణ ఉంది. అందుకే ఇప్పుడు దువ్వాడ శ్రీనివాస్ సొంత యూట్యూబ్ ఛానల్ పెట్టుకుని కింజరాపు, ధర్మాన కుటుంబం పై ఓ రేంజ్ లో విరుచుకుపడుతున్నారు.శ్రీకాకుళం జిల్లాలో మూలపేట కోర్టు నిర్మాణం దాదాపు చివరి దశకు వచ్చింది. అయితే ఆ పోర్టు తమ ప్రభుత్వ హయాంలో జరిగిందని వైసిపి, ఇటు టిడిపి క్రెడిట్ కోసం ఆరాటపడుతున్నాయి. ధర్మాన సోదరుల నేతృత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీమూలపేట కోర్టు సందర్శనకు సిద్ధపడింది. దీంతో మళ్లీ దువ్వాడ శ్రీనివాస్ కు కోపం వచ్చింది. పళ్ళు కొరుకుతూ రగిలిపోతూ కనిపించారు దువ్వాడ శ్రీనివాస్. ఆ పోర్టు క్రెడిట్ జగన్మోహన్ రెడ్డిదని.. తరువాత తనదేనని చెప్పుకొచ్చారు దువ్వాడ. అయితే దువ్వాడ తాను అభిమానించే జగన్ వద్దకు వెళ్లలేకపోతున్నారు. తాను సాధించానని చెబుతున్న మూలపేట పోర్టును సందర్శించలేకపోతున్నారు. అందుకే ఇప్పుడు ఆ రెండు కుటుంబాలపై పడ్డారు దువ్వాడ. సోషల్ మీడియాలో దీనిపైనే సెటైర్లు పడుతున్నాయి.

03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ. వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## పార్టీలు మార్పులు తప్పవా

**విజయవాడ, మార్చి30, పెన్ పవర్:** ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో నాయకుల పాత్ర మరింత కీలకంగా మారుతున్నది. గత ఎన్నికల సమయంలోనే చాలా మంది నాయకులు తమ రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పార్టీలను మార్చడం కనిపించింది. ఎవరికైతే ఎక్కడ అవకాశాలు కనిపించాయో, వారు ఆ దిశగా అడుగులు వేసిన పరిస్థితి ఏర్పడింది. టీడీపీ , జనసేన, వైసీపీ ఇలా ఏ పార్టీలో చూసినా ఎన్నికల ముందు మార్పులు కనిపిస్తూనే ఉంటాయి.గెలిచిన వారు తమ స్థాయిని పెంచుకోగా, ఓడిన వారు కొత్త అవకాశాల కోసం మళ్లీ రాజకీయ సమీకరణలను పరిశీలిస్తున్నారు.రాబోయే ఎన్నికల నాటికి ఈ మార్పులు మరింత వేగంగా జరుగుతాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశం ఉండటంతో, రాజకీయ నాయకులకు మరింత స్వేచ్ఛ లభించనుంది. ఇది ఒకవైపు పార్టీలకు కూడా అవసరం అవుతుంది. ఎందుకంటే కొత్త సీట్లు పెరిగినప్పుడు సరైన అభ్యర్థులను ఎంపిక చేయడం కీలకం అవుతుంది. అందువల్ల గెలుపు సామర్థ్యం ఉన్న నాయకులను ఆకర్షించేందుకు పార్టీలు కూడా ముందుకు రావాల్సి ఉంటుంది.గత ఎన్నికల సమయంలో టికెట్ల కోసం జరిగిన రాజకీయ మార్పులు అందరికీ గుర్తున్నాయి. చాలామంది నాయకులు తమకు టికెట్ వచ్చే అవకాశాలను బట్టి పార్టీలు మార్చుకున్నారు. మరోవైపు రాజకీయ పార్టీలు కూడా గెలుపు గుర్రాలుగా భావించిన నాయకులను ప్రత్యేకంగా ఆహ్వానించి పార్టీలో చేర్చుకున్నాయి. ఈ విధంగా ఇరువర్గాల మధ్య పరస్పర ఆధారపడే పరిస్థితి ఏర్పడింది.ఇప్పటి పరిస్థితుల్లో ఈ ధోరణి మరింత పెరిగే అవకాశముంది. నియోజకవర్గాల పునర్విభజన వల్ల కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడతాయి. కొత్త ప్రాంతాలు, కొత్త ఓటరు సమీకరణాలు రావడం వల్ల నాయకులు తమకు అనుకూలంగా ఉండే పార్టీలు లేదా వర్గాలను ఎంచుకునే స్వేచ్ఛ పొందుతారు. దీంతో రాజకీయాల్లో వ్యక్తిగత నిర్ణయాలకు ఎక్కువ ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంది.అయితే ఈ స్వేచ్ఛకు మరో కోణం కూడా ఉంది. నాయకులు తరచూ పార్టీలు మారడం వల్ల రాజకీయ స్థిరత్వం దెబ్బతినే ప్రమాదం ఉందని కొందరు విశ్లేషకులు అంటున్నారు. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన సమయంలో కూడా ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. అప్పట్లో అనేక మంది నాయకులు తమకు అనుకూలంగా పార్టీలను మార్చుకుని రాజకీయంగా కొత్త అవకాశాలను అందిపుచ్చుకున్నారు.ఇప్పుడు కూడా అదే పరిస్థితి పునరావృతం అవుతుందా లేదా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కొందరు నాయకులు పార్టీ పట్ల నిబద్ధత చూపుతారా లేక వ్యక్తిగత ప్రయోజనాలను ముందుకు పెట్టుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రజల అభిప్రాయం కూడా ఈ విషయంలో కీలకంగా మారే అవకాశం ఉంది. మరోపక్క ఇలా పార్టీలు మారిన వారికి పదవులు కట్టు పెట్టడం వల్ల కొన్ని సంవత్సరాలుగా పార్టీని నమ్ముకున్న వారి మనోభావాలు దెబ్బతింటున్నాయి. మొత్తంగా చూస్తే ప్రస్తుతం ఉన్న రాజకీయ వాతావరణం పవర్ఫుల్ నాయకులకు అనుకూలంగా మారుతోంది. ఈ అవకాశాన్ని వారు ఎలా వినియోగించుకుంటారన్నది రాబోయే రోజుల్లో స్పష్టతకు వస్తుంది. భవిష్యత్తులో రాజకీయ సమీకరణాల్లో మార్పులు తప్పవని సంకేతాలు కనిపిస్తున్నాయి.

## పార్లమెంట్ లో వైసీపీ స్టాండ్ ఏంటీ


**నెల్లూరు, మార్చి 30 పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్ రాజకీయ పరిస్థితులు ప్రస్తుతం తీవ్ర విభజనతో సాగుతున్నాయి. ఇక్కడ రాజకీయ పార్టీలు ఒకరినొకరు ప్రత్యర్థులుగా కాకుండా శత్రువులుగా చూసుకునే స్థాయికి చేరుకున్నాయని అనిపిస్తోంది. గత కొన్నేళ్లుగా ఇదే పరిస్థితి కొనసాగుతుండగా, ప్రజాస్వామ్య సంప్రదాయాలు కూడా చాలా వరకు కనుమరుగయ్యాయన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దేశంలోని ఇతర రాష్ట్రాల్లో కనిపించే చర్చా సంస్కృతి, పరస్పర గౌరవం వంటి అంశాలు ఏపీలో కనిపించడం లేదని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అమరావతి రాజధానికి చట్టబద్ధ హోదా కల్పించాలనే అంశంపై రాష్ట్ర శాసనసభ ప్రత్యేక సమావేశం నిర్వహించి తీర్మానం ఆమోదించడం ప్రాధాన్యత సంతరించుకుంది. అయితే అదే సమయంలో శాసన మండలి లో ఈ తీర్మానాన్ని ప్రవేశపెట్టకపోవడం రాజకీయంగా చర్చకు దారితీసింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ దీనిపై విమర్శలు చేస్తూ, ఇది కేవలం రాజకీయ నాటకమని ఆరోపిస్తోంది.రెండు సభలు ఉన్న రాష్ట్రాల్లో ముఖ్యమైన అంశాలను రెండింటిలోనూ చర్చించడం సాధారణ పద్ధతి. కానీ ఈ సందర్భంలో పరిస్థితి భిన్నంగా మారింది. అసెంబ్లీలో వైసీపీ ఎమ్మెల్యేలు ఉన్నప్పటికీ వారు చర్చకు దూరంగా ఉండటం గమనార్హం. మరోవైపు మండలిలో వైసీపీకి బలం ఎక్కువగా ఉండడంతో అక్కడ చర్చ జరగాలని వారు డిమాండ్ చేస్తున్నారు. దీనిని రాజకీయ వ్యూహంగా చూడాలని కొందరు అభిప్రాయపడుతున్నారు.అయితే ఈ అంశంలో కూటమి ప్రభుత్వం కూడా తన నిర్ణయాన్ని స్పష్టంగా తీసుకుందని అంటున్నారు. అమరావతి విషయంలో రాష్ట్ర శాసనసభ తీర్మానం కేవలం అభిప్రాయాన్ని తెలియజేయడానికే పరిమితమని నిపుణులు చెబుతున్నారు. ఇది చట్టం చేసే ప్రక్రియ కాదని, కేవలం కేంద్రానికి రాష్ట్ర అభిప్రాయం చేరవేయడమే ముఖ్య ఉద్దేశమని స్పష్టం చేస్తున్నారు.అసలు చట్టబద్ధ ప్రక్రియ మొత్తం పార్లమెంట్ పరిధిలో జరుగుతుంది. ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టం లో మార్పులు చేయాల్సి ఉండటంతో, కేంద్ర ప్రభుత్వం లోక్‌సభ, రాజ్యసభల్లో బిల్లు ప్రవేశపెడుతుంది. ఆ బిల్లు రెండు సభల్లో ఆమోదం పొందిన తర్వాత రాష్ట్రపతి ఆమోదంతో గెజిట్ నోటిఫికేషన్ జారీ అవుతుంది. అప్పుడే అమరావతి అధికారికంగా శాశ్వత రాజధానిగా గుర్తింపు పొందుతుంది.ఈ నేపథ్యంలో శాసన మండలిలో తీర్మానం ప్రవేశపెట్టకపోవడం పెద్ద సమస్య కాదని కొందరు రాజ్యాంగ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఎందుకంటే కేంద్రం కోరింది రాష్ట్ర అసెంబ్లీ అభిప్రాయం మాత్రమేనని, అది తీర్మానం ద్వారా పంపించబడిందని వారు చెబుతున్నారు. ఇక వైసీపీ ఈ అంశంపై విమర్శలు చేయడం వల్ల రాజకీయంగా వారికి నష్టం జరిగే అవకాశం ఉందని విశ్లేషణలు సూచిస్తున్నాయి. అసెంబ్లీలో ప్రాతినిధ్యం ఉన్నప్పటికీ చర్చలో పాల్గొనకపోవడం ప్రజల్లో ప్రతికూల అభిప్రాయాన్ని కలిగించవచ్చని అంటున్నారు. మొత్తంగా అమరావతి అంశం చుట్టూ రాజకీయంగా వేడి పెరుగుతుండగా, రాబోయే రోజుల్లో కేంద్ర స్థాయిలో తీసుకునే నిర్ణయాలు కీలకంగా మారనున్నాయి.

## ఎమ్మెల్యే బహిరంగ క్షమాపణ

**హైదరాబాద్ పెన్ పవర్:** ఆదివాసీ యువకునిపై ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాలం.అశోక్ బాబు చేసిన అనుచిత వ్యాఖ్యలను ఆయన వెనక్కి తీసుకోని బహిరంగ క్షమాపణలు కోరారు. ఎస్టి కులంలో బెంతోరియా సామాజిక వర్గాన్ని చేరుస్తున్నారని వారిని ఎస్టిలుగా పరిగనించవద్దని ఎస్టి వర్గాలు అశోక్ బాబును కలవడానికి వచ్చినప్పుడు ఎస్టి యువకుడు భగవాన్ తనను ఉద్దేశించి అసెంబ్లీలో మాట్లాడానికి నువ్వెవరు! అని ప్రశ్నించటంతో తాను ఆవేశంలో ఆ వ్యాఖ్యలు అతనిపై చేసానే కానీ ఆ సామజికవర్గాన్ని ఉద్దేశించి కాదని అన్నారు. 26వ తారీఖున జరిగిన మొత్తం సంభాషణ వార్తలు వేస్తే బాగున్నని కానీ కొంతమంది ఆ విజువల్స్ ను ఎడిటింగ్ చేసి తాను తప్పుమాట్లాడినట్లు చూపించటం తగదని ఆవేదన వ్యక్తం చేసారు. ఆ రోజు ఆ యువకుడు తరుపున ఆ సామజికవర్గం తనకు క్షమాపణ చెప్పారని అది ప్రజలకు తెలిసేలా చేసుంటే విషయం తారస్థాయికి చేరేది కాదని అన్నారు. వైసీపీ హయాంలో బెంతోరియా కులానికి చేసింది ఏమి లేకపోయిన తన వ్యాఖ్యలను సామజిక మాధ్యమాల్లో పెట్టి తనను బయపెట్టాలని వైసీపీ నాయకులు చూస్తున్నారని ఇటువంటి తాటాకు చప్పుల్లకు భయపడేది లేదని హెచ్చరించారు. తన వ్యాఖ్యలు వలన ఎవరి మనోభావాలు దెబ్బతిన్న తాను బహిరంగ క్షమాపణలు చెబుతున్నానని తెలిపారు.

# రాజధాని మార్పు సాధ్యం కాదా...

**గుంటూరు, మార్చి 30, పెన్ పవర్:**
రాజధానికి చట్టబద్ధత కల్పించేందుకు తీర్మానం చేసింది ఏపీ అసంబ్లీ. కేంద్రం కూడా విభజన చట్టంలో పెట్టేస్తుంది. అంత వరకూ బాగానే ఉంది. కానీ జగన్ సీఎం అయితే రాజధానిని మార్చలేరన్న ప్రచారం మాత్రం అవాస్తవం. మన దేశంలో అమలు చేసినవే చట్టాలు. అమలు చేయకూడదనుకుంటే..దాని కోసం పాలకులు ఎన్నో మార్గాలు వెదుకుతారు. రాజధాని విషయంలో చట్టబద్ధత ఉంటే ఇక మార్పు అసాధ్యం అనుకోవడం అమాయకత్వమే అవుతుంది. వ్యవస్థలను ఎలా వాడుకోవాలో, చట్టాల్లోని లొసుగులను ఎలా వెతకాలో తెలిసిన పాలకులకు ఏదీ అసాధ్యం కాదు.విభజన చట్టంలో అమరావతి పేరు చేర్చినంత మాత్రాన అది శాశ్వతం అయిపోదు. చట్టాలు అనేవి పాలనను క్రమబద్ధం చేయడానికి ఉంటాయి కానీ, పాలకుల పట్టుదలను అడ్డుకోలేవు. గతంలో మూడు రాజధానులు అనే ప్రతిపాదన తెచ్చినప్పుడు, అమరావతిని తీసేస్తున్నామని వారు ఎక్కడా చెప్పలేదు. కానీ, అభివృద్ధిని ఆపేయడం ద్వారా, నిధులను మళ్లించడం ద్వారా ఆ ప్రాంతాన్ని ఒక ఎడారిగా మార్చగలిగారు. అంటే, చట్టాన్ని మార్చకపోయినా, దాని ప్రాధాన్యతను తగ్గించే నిర్వీర్య ప్రక్రియ రాజకీయంగా చాలా సులభం.ముఖ్యమంత్రి ఎక్కడ కూర్చుంటే అక్కడే అధికారం ఉంటుందనేది జగన్ చెప్పేమాట. విశాఖలోని రుషికొండపై నిర్మించిన భవనాలు కేవలం గెస్ట్ హౌస్‌లు మాత్రమే కావు, అవి ఒక సమాంతర సచివాలయానికి పునాదులు. చట్టం ప్రకారం రాజధాని అమరావతిలోనే ఉన్నా, క్యాంప్ ఆఫీస్ పేరుతో పాలకుడు విశాఖ నుంచే చక్రం తిప్పవచ్చు. జగన్ అమరావతిని రాజధానిగా కొనసాగిస్తానని ప్రకటన చేసి.. సీఎంకాగానే రాజధాని నిర్మాణానికి అవసరమైన రూ. 50 వేల కోట్ల ప్రాజెక్టును అర్ధాంతరంగా ఆపేయడం, అంతర్జాతీయ సంస్థలైన వరల్డ్ బ్యాంక్ వంటి వాటిని వెనక్కి వెళ్లేలా చేశారు. తర్వాత సీఎం అయినా ఇలా చేయరన్న గ్యారంటీలేదు.రాజధాని అంటే కేవలం భవనాలు కాదు, అది రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు గుండెకాయ. ఐటీ కంపెనీలు, మౌలిక సదుపాయాలు, ఉద్యోగ అవకాశాలు అన్నీ నమ్మకం మీద ఆధారపడి వస్తాయి. పాలకుడు మారినప్పుడల్లా రాజధాని మారుతుందన్న భయం ఉంటే ఏ పెట్టుబడిదారుడూ ఏపీ వైపు చూడడు. యువతకు ఉజ్వల భవిష్యత్తు కావాలంటే నిలకడైన పాలన, రాజధాని పట్ల స్పష్టమైన విజన్ ఉన్న నాయకత్వం అవసరం. గందరగోళం సృష్టించే ధోరణి ఉన్న నాయకుడు అధికారంలో ఉంటే, చట్టం ఉన్నా లేకపోయినా అభివృద్ధి కుంటుపడుతుంది.అమరావతిని ఎవరూ మార్చలేరు అనే ధీమా మంచిదే. కానీ మార్చబోము .. అమరావతిని అభివృద్ధి చేస్తామని వైసీపీ ఇప్పటికీ ప్రకటించలేదు. ప్రకటించినా నమ్మే పరిస్థితుల్లో జనం లేరు. రాజ్యాంగబద్ధంగా ఉన్న అధికారాలను



వాడుకుని, వ్యవస్థలను మేనేజ్ చేసి, ఒక ప్రాంతాన్ని పనికిరాకుండా చేసే శక్తి అధికారంలో ఉన్న వారికి ఉంటుంది. ఆ పని గతంలో జగన్ చేశారు. వస్తే మళ్లీ చేస్తారు. రాజధాని మనుగడ అనేది కేవలం చట్టం మీద కాదు, ఆ చట్టాన్ని అమలు చేసే వ్యక్తి ఉద్దేశం మీద ఆధారపడి ఉంటుంది. ఏపీ భవిష్యత్తు నిలవాలంటే, రాజధానిని ఒక సెంటిమెంట్ గా కాకుండా 'కమిట్‌మెంట్' గా భావించే నాయకత్వం కొనసాగాల్సిన అవసరం ఉంది.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్చను ప్రారంభిస్తూ గత ప్రభుత్వ తీరుపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ప్రపంచస్థాయి రాజధానిని నిర్మించాలనే సంకల్పంతో 34 వేల ఎకరాలను రైతులు స్వచ్ఛందంగా ఇచ్చారు. కానీ, జగన్ మోహన్ రెడ్డి కేవలం రాజకీయ కక్షతో రాజధానిని స్మశానంగా మార్చారు అని ఆవేదన వ్యక్తం చేశారు. మూడు రాజధానుల ముసుగులో అమరావతిని అనాథను చేశారని, రైతులను రోడ్డున పడేసిన పాపం గత ప్రభుత్వానిదేనని ఆయన స్పష్టం చేశారు. ఇప్పుడు చేస్తున్న తీర్మానం అమరావతికి రక్షణ కవచంలా మారుతుందని భరోసా ఇచ్చారు.ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తనదైన శైలిలో ఘాటుగా స్పందించారు. అమరావతి అనేది కేవలం ఒక కులానికో, ప్రాంతానికో చెందింది కాదు.. అది ఐదు కోట్ల ఆంధ్రుల ఆత్మగౌరవం అని గర్జించారు. జగన్ సర్కార్ రాజధానిని చెరబట్టి రాష్ట్ర భవిష్యత్తును పదేళ్లు వెనక్కి నెట్టేసిందని విమర్శించారు. వైసీపీ ఎమ్మెల్యేలు సభకు రాకుండా పారిపోయారని, కనీసం తప్పు ఒప్పుకునే ధైర్యం కూడా వారికి లేదని ఎద్దేవా చేశారు. అమరావతిని వెలుగుల జిలుగుల నగరంగా మార్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని చాటిచెప్పారు.ఐదేళ్ల పాలనను సైకో పాలన గా నారా లోకేష్ అభివర్ణించారు. అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక గ్రాఫిక్సం
అంటూ అబద్ధాలు ప్రచారం చేశారని మండిపడ్డారు. ఇన్సైడర్ ట్రేడింగ్ పేరుతో బురదజల్లి, కోర్టుల చుట్టూ తిప్పి కాలయాపన చేశారని దుయ్యబట్టారు. ఇప్పుడు అమరావతికి కేంద్రం నుంచి నిధులు రాబట్టడమే కాకుండా, చట్టబద్ధత కల్పించి ఏ శక్తీ అడ్డుకోలేని విధంగా అభివృద్ధి చేస్తామని లోకేష్ స్పష్టం చేశారు. వైసీపీ హయాంలో అమరావతి రైతులపై జరిగిన దాడులు, అక్రమ కేసులను అచ్చెన్నాయుడు గుర్తు చేశారు. బీజేపీ సభ్యుడు, మంత్రి సత్యకుమార్ యాదవ్ కేంద్ర ప్రభుత్వం అమరావతి అభివృద్ధికి కట్టుబడి ఉందని, విభజన చట్టం సవరణ ద్వారా దీనికి మరింత బలం వస్తుందని పేర్కొన్నారు. విష్ణుకుమార్ రాజు వంటి నేతలు కూడా జగన్ ప్రభుత్వం చేసిన రాజధాని ద్రోహం ను అంకెలు, సాక్ష్యాలతో సహా వివరించారు.ఈ చర్చకు వైసీపీ హాజరుకాకపోవడం ఆ పార్టీకి పెద్ద దెబ్బగా మారింది. కూటమి నేతలు చేసిన తీవ్రమైన ఆరోపణలను తిప్పికొట్టే అవకాశం ఉన్నా, సభను బహిష్కరించడం ద్వారా వైసీపీ తన ఓటమి ని అంగీకరించినట్లయింది. తప్పు ఒప్పుకున్నట్లయింది.

# కడపలో స్టీల్ ప్లాంట్ అడుగులు

**కడప, మార్చి 30 పెన్ పవర్:** ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ శంకుస్థాపన జరిగింది. ఇప్పుడు కడప ఉక్కు కర్మాగారం ఏర్పాటు దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మరో కీలక అడుగు వేసింది. వైఎస్ఆర్ జిల్లా జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లె పరిసరాల్లో నిర్మించతలపెట్టిన ఈ ప్రాజెక్టుకు సంబంధించి, సుమారు 3 వేల ఎకరాలకు పైగా భూమిని జిందాల్ స్టీల్ ఆంధ్ర లిమిటెడ్ సంస్థకు అప్పగిస్తూ అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యాయి. దశాబ్దాలుగా రాయలసీమ ప్రజల కలగా ఉన్న ఈ ఉక్కు పరిశ్రమ సాకారం కావడానికి ఈ భూముల బదిలీ ఒక ప్రధాన మలుపుగా భావిస్తున్నారు.గతంలో ఈ ప్రాజెక్టు కోసం వివిధ సంస్థలతో చర్చలు జరిగినప్పటికీ, అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఉక్కు ఉత్పత్తి చేసేందుకు జిందాల్ గ్రూప్ ముందుకు వచ్చింది. ఈ ప్లాంట్ ద్వారా ఏటా దాదాపు 3 మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం జిందాల్ సంస్థ సుమారు రూ. 8,883 కోట్ల భారీ పెట్టుబడి పెట్టేందుకు సిద్ధమైంది. భూమి అప్పగింత ప్రక్రియ పూర్తి కావడంతో, ఇక ప్లాంట్ నిర్మాణ పనులు వేగవంతం కానున్నాయి.ఈ ప్రాజెక్టు వల్ల రాయలసీమ ప్రాంతంలో పారిశ్రామికాభివృద్ధి ఊపందుకోవడమే కాకుండా, ప్రత్యక్షంగా మరియు పరోక్షంగా వేల సంఖ్యలో నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయి. ముఖ్యంగా వెనుకబడిన కడప జిల్లాలో మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అనుబంధ పరిశ్రమలు కూడా వెలిసే అవకాశం ఉంది. ప్రభుత్వం ఈ ప్రాజెక్టుకు అవసరమైన నీరు, విద్యుత్ రహదారి సౌకర్యాలను కల్పించేందుకు ఇప్పటికే ప్రణాళికలు సిద్ధం చేసింది.భూసేకరణ సమయంలో స్థానిక రైతుల నుంచి వచ్చిన అభ్యర్థనలు, పరిహారం పంపిణీ వంటి అంశాలను ప్రభుత్వం సమర్థవంతంగా పరిష్కరించింది. వైసీపీ హాయంలో శంకుస్థాపన జరిగినప్పటికీ.. భూ సమస్యలను పరిష్కరించకపోవడంతో పట్టాలెక్కలేదు. ఇప్పుడు ప్రభుత్వం అన్నీ పరిష్కరిస్తోంది. జిందాల్ వంటి ప్రతిష్టాత్మక సంస్థ ఈ ప్రాజెక్టును చేపట్టడం వల్ల నిర్ణీత గడువులోగా నిర్మాణం పూర్తవుతుందని అటు రాజకీయ వర్గాలు, ఇటు పారిశ్రామిక నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. ఏపీ పారిశ్రామిక ముఖచిత్రంలో కడప స్టీల్ ప్లాంట్ ఒక మైలురాయిగా నిలవనుంది.స్టీల్ ప్లాంట్ నిర్మించాలన్నది దశాబ్దాల కల. జమ్మలమడుగు మండలం సున్నపురాళ్లపల్లెలో స్టీల్ ప్లాంట్ నిర్మాణం చేపట్టాలన్నది గత కొన్నేళ్లుగా ఆలోచన. ఎట్టకేలకు అది కార్యరూపం దాల్చబోతోంది. ఈ పరిశ్రమ కోసం సేకరించిన మూడువేల ఎకరాలకు పైగా భూమిని జిందాల్ స్టీల్ ఆంధ్ర పరిశ్రమకు బదలాయించింది కూటమి ప్రభుత్వం. అందుకు సంబంధించి ఉత్తర్వులు కూడా జారీ అయ్యాయి.



దశాబ్దాల కల నెరవేరే రోజు ఆసన్నం అయ్యింది. గతంలో ఈ ప్రాజెక్టును పట్టాలెక్కించేందుకు చాలా కంపెనీలతో చర్చలు జరిగాయి. అయితే అత్యున్నత ప్రమాణాలతో స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి జిందాల్ స్టీల్ ఆంధ్ర కంపెనీ ముందుకు వచ్చింది. ఈ కంపెనీ దాదాపు మూడు మిలియన్ టన్నుల ఉక్కును ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. జిందాల్ స్టీల్ ఆంధ్ర కంపెనీ సుమారు రూ.8,883 కోట్ల పెట్టుబడి పెట్టేందుకు ముందుకు రావడం విశేషం. ప్రధానమైన భూ బదలాయింపు జరగడంతో మిగిలిన పనులు మొదలు పెట్టనుంది జిందాల్వెనుకబడిన జిల్లాగా నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది ప్రధాన లక్ష్యం. అందులో భాగంగా ఈ స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి వైయస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రయత్నాలు చేసింది. శంకుస్థాపన కూడా చేసింది. కానీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పరిహారం పంపిణీ పూర్తి అయ్యింది. మరోవైపు ప్లాంట్ కు అవసరమైన మౌలిక వసతుల కల్పన పై ఏపీ ప్రభుత్వం దృష్టి పెట్టింది. రహదారులతోపాటు తాగునీరు అందించాలని నిర్ణయించింది. మొత్తానికి అయితే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణానికి ఒక ముందడుగు పడినట్లు అయ్యింది.

## ధోనీ లేకుండానే బరిలోకి చెన్నై.. RR vs CSK మ్యాచ్ పిచ్ రిపోర్ట్, ప్లేయింగ్ XI ఇదే!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ జట్టు తన తొలి మ్యాచ్‌ను రాజస్థాన్ రాయల్స్ జట్టుతో గౌహతిలోని బర్సపరా స్టేడియంలో ఆడనుంది. ఈ మ్యాచ్‌కు ముందు చెన్నైకి పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. జట్టు సీనియర్ ఆటగాడు ఎంఎస్ ధోనీ గాయంతో తొలి రెండు వారాలు అందుబాటులో ఉండడని ఫ్రాంచైజీ ప్రకటించింది. దీంతో జట్టులో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. ఈ మ్యాచ్‌లో సంజు శాంసన్‌పై ప్రత్యేక దృష్టి ఉంది. గతంలో రాజస్థాన్ జట్టుకు ప్రాతినిధ్యం వహించిన అతడు ఇప్పుడు సీఎస్కేలోకి మారి తొలి మ్యాచ్ ఆడనున్నాడు. కెప్టెన్ రుతురాజ్ గైక్వాడ్‌తో పాటు సర్ఫరాజ్ ఖాన్, మాథ్యూ షార్ట్, శివం దూబేలు బ్యాటింగ్‌లో కీలక పాత్ర పోషించనున్నారు. అయితే డెవాల్డ్ బ్రెవిస్ లేకపోవడం జట్టుకు పెద్ద లోటు అని చెప్పాలి. ఇక బౌలింగ్‌లో మ్యాట్ హెన్రీ, నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్ బాధ్యతలు చేపట్టనున్నారు.

రాజస్థాన్ జట్టు విషయానికి వస్తే, వైభవ్ సూర్యవంశీ అద్భుతమైన ఆరంభం ఇవ్వాలని చూస్తున్నారు. యశస్వి జైస్వాల్, ధృవ్ జురెల్, కెప్టెన్ రియాన్ పరాగ్ బ్యాటింగ్‌లో కీలకం కానున్నారు. జోఫ్రా ఆర్చర్, ఆడమ్ మిల్నే, రవీంద్ర జడేజా లాంటి బౌలర్లు జట్టుకు అదనపు బలం. గౌహతిలోని బర్సపరా స్టేడియంలోని పిచ్ సాధారణంగా బ్యాటింగ్‌కు అనుకూలంగా కాదు.. ఇక్కడ బౌలర్లే ఎక్కువగా ఆధిపత్యం ప్రదర్శిస్తారు. మొదటి ఇన్నింగ్స్ సగటు స్కోరు సుమారు 146 పరుగుల వరకు ఉంటుంది. పెద్ద స్కోర్లు చాలా అరుదుగా నమోదవుతాయి.

**హెడ్ టు హెడ్ రికార్డులు:**
ఈ రెండు జట్లు ఇప్పటివరకు 32 మ్యాచ్‌లు ఆడగా, చెన్నై 16, రాజస్థాన్ 16 మ్యాచ్‌లలో గెలిచి సమానంగా నిలిచాయి. దీంతో ఈ మ్యాచ్ కూడా ఆసక్తికరంగా మారే అవకాశం కనిపిస్తుంది. మొత్తానికి ఇరు జట్లలో బలమైన ఆటగాళ్లు ఉండటంతో అభిమానులకు ఆసక్తికర పోరుని అందించే అవకాశం ఉంది.

**పిచ్ రిపోర్ట్:**
గౌహతిలోని బర్సపరా స్టేడియంలో పిచ్ ఫ్లాట్‌గా ఉండే అవకాశం ఉంది. లక్ష్యాన్ని ఛేదించే జట్టు పైచేయి సాధించే ఛాన్స్ కనిపిస్తుంది. వికెట్‌పై కొంత గడ్డి ఉన్నప్పటికీ, అది కేవలం ఉపరితలాన్ని పట్టుగా ఉంచడానికే మాత్రమే.. మంచు ప్రభావం వలన వేగవంతమైన అవుట్‌ఫీల్డ్ స్పిన్నర్లకు సమస్యగా మారనుంది.

**RR vs CSK ప్లేయింగ్ XI:**
రాజస్థాన్ రాయల్స్: యశస్వి జైస్వాల్, వైభవ్ సూర్యవంశీ, రియాన్ పరాగ్ (కెప్టెన్), షిమ్రోన్ హెట్మెయర్, ధృవ్ జురెల్ (వికెట్ కీపర్), రవీంద్ర జడేజా, దసున్ షనక, జోఫ్రా ఆర్చర్, సందీప్ శర్మ, రవి బిష్ణోయ్, ఆడమ్ మిల్నే.

**ఇంపాక్ట్ ప్లేయర్ : అమన్ రావు**

చెన్నై సూపర్ కింగ్స్: సంజు శాంసన్ (వికెట్ కీపర్), రుతురాజ్ గైక్వాడ్ (కెప్టెన్), ఆయుష్ మాత్రే, సర్ఫరాజ్ ఖాన్, శివమ్ దూబే, ప్రశాంత్ వీర్, జామీ ఓవర్టన్, అన్షుల్ కాంబోజ్, రాహుల్ చాహర్, నూర్ అహ్మద్, ఖలీల్ అహ్మద్.

ఇంపాక్ట్ ప్లేయర్ : కార్తిక్ శర్మ

## రోహిత్ 2.0 రెడీ.. ప్రత్యర్థి జాగ్రత్తగా ఉండాల్సిందే!





**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ 2026 సీజన్ ని రోహిత్ శర్మ సూపర్ స్టార్ట్ చేశాడు. 200ం స్ట్రైక్ రేట్ తో హాఫ్ సెంచరీ చేసిన అతడిపై సర్వత్రా ప్రశంసలు వస్తున్నాయి. కేవలం 38 బంతుల్లోనే 78 రన్స్ చేసిన ముంబై జట్టు విజయంలో కీ రోల్ పోషించాడు. ఈ క్రమంలో టీమిండియా మాజీ క్రికెటర్ అనిల్ కుంబ్లే ఐపీఎల్ లోని మిగతా టీమ్స్ కి హెచ్చరించాడు. రోహిత్ 2.0 రెడీ అయింది.. ప్రత్యర్థి జట్లు జాగ్రత్తగా ఉండాలని సూచనలు జారీ చేశాడు. కోల్‌కతాపై రోహిత్ శర్మ ఆటను చూసిన తర్వాత ఒకటే చెబుదామని ఉందా అని అనిల్ కుంబ్లే పేర్కొన్నారు. మైదానంలో అతడు బంతిని ఎదుర్కొన్న తీరును చూస్తే ప్రత్యర్థికి హెచ్చరికలు పంపినట్లుగా అనిపిస్తోంది.. అత్యుత్తమ ఫామ్ లో ఉన్నప్పటి రోజులను మళ్లీ గుర్తు చేసేశాడు. వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్, ముజరబాని లాంటి బౌలింగ్ లో ఈజీగా సిక్సులు కొట్టేశాడు. స్వల్ప విరామం తర్వాత స్టేడియంలోకి ఎంట్రీ ఇచ్చిన రోహిత్.. లయను అందుకోవడానికి కనీసం ఐదారు రోజుల సమయం పడుతుంది. కానీ, రోహిత్ పై ఆ ప్రభావం ఏమీ కనిపించలేదని కుంబ్లే వెల్లడించారు. కోల్‌కతా నైట్‌రైడర్స్ బౌలింగ్ లో వరుణ్ చక్రవర్తి, సునీల్ నరైన్ కీలకం.. కానీ, నరైన్ తన నాలుగు ఓవర్ల కోటా కూడా పూర్తి చేయలేకపోయడం అందర్ని షాక్ కి గురి చేసింది. రోహిత్-- ర్యాన్ -రికెల్టన్ దెబ్బకి పవర్ ప్లేలోనే అతడికి బౌలింగ్ ఇవ్వకపోవడం తీవ్ర నిరుత్సాహ పరిచింది. సునీల్ నరైన్ బౌలింగ్ కి వచ్చే సమయానికి జరగాల్సిన పూర్తి నష్టం జరిగిపోయింది. ఇక్కడే కేకేఆర్ తమ విజయావకాశాలను పూర్తిగా దెబ్బ తీసుకుంది. వారి వనరులను కాస్త మెరుగ్గా ఉపయోగించుకోవాలని అనిల్ కుంబ్లే పేర్కొన్నారు.

## బంగ్లాదేశ్ క్రికెట్ ఫ్యాన్స్‌కి బ్యాడ్‌న్యూస్.. ప్రసార ఒప్పందాన్ని రద్దు చేసిన జియో



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్) టోర్నమెంట్ వేళ బంగ్లాదేశ్ క్రికెట్ ఫ్యాన్స్ కి షాకిచ్చింది. భారత్ కి చెందిన జియోస్టార్ బంగ్లాలో ఐపీఎల్ ప్రసార ఒప్పందాన్ని రద్దు చేసుకున్నట్లు వెల్లడించింది. ఐపీఎల్ ప్రసారాలపై గతంలో విధించిన నిషేధంపై పునరాలోచిస్తున్నట్లు అక్కడి సర్కార్ చెప్పిన తర్వాత ఈ పరిణామం జరగడం గమనార్హం. ఈ రద్దు తక్షణమే అమల్లోకి వస్తుందని టీస్పోర్ట్స్ (బంగ్లాదేశ్ బ్రాడ్కాస్టర్)కు జియోస్టార్ రాసిన లేఖ ఆధారంగా ఇంటర్నేషనల్ మీడియా కథనాలు తెలిపాయి. ఒప్పందం ప్రకారం భాగస్వామ్య పక్షం గడువులోగా చెల్లింపులు చేయడంలో ప్రతిసారి ఫెయిల్ కావడమే ఈ నిర్ణయానికి కారణమని సమాచారం. బంగ్లాదేశ్ తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ ఉన్న సమయంలో హిందూ మైనార్టీలపై జరిగిన దాడులు జరిగాయి. అలాంటి సమయంలో బంగ్లాదేశ్ పేసర్ ముస్తాఫిజుర్ రెహమాన్ ను మినీ వేలంలో కేకేఆర్ రూ.9.20కోట్లకు సొంతం చేసుకోవడంపై పెద్ద ఎత్తున విమర్శలు వచ్చాయి. దాంతో బీసీసీఐ ఆదేశాల మేరకు అతడిని వదులుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. అనంతరం బంగ్లాదేశ్ సర్కార్.. తమ దేశంలో ఐపీఎల్ ప్రసారాలను నిలిపివేస్తూ ఉత్తర్వులు ఇచ్చింది. బంగ్లాలో కొత్తగా ఏర్పడిన సర్కార్ ఆ నిషేధంపై పునరాలోచిస్తామని సంకేతాలు ఇచ్చేసింది. ఇంతలోనే జియో డీల్ నుంచి బయటకు వచ్చేందుకు రెడీ అయింది. ఇందుకు భాగస్వాముల మధ్య ఉన్న ఆర్థికపరమైన లావాదేవీలే కారణమని సమాచారం. ప్రపంచంలోనే అత్యంత సంపన్న క్రికెట్ లీగ్ గా పేరుగాంచిన ఐపీఎల్ ను ఢాకా ఫ్యాన్స్ బాగా ఆదరిస్తారు. తాజా నిర్ణయం వ్యూయర్‌షిప్, ఫ్యాన్ ఎంగేజ్మెంట్ పై తీవ్ర ప్రభావం చూపించనుంది. కాగా, జియో నిర్ణయంతో ఐపీఎల్ ప్రసారాల కోసం 2027 వరకు టీస్పోర్ట్స్ కి ఉన్న పర్మిషన్స్ రద్దు అయ్యాయి.

## బైకర్ కోసం రోజుకి 32 కి.మీ.. శర్వా డెడికేషన్ కు హ్యాట్సాఫ్!

బైకర్ కోసం శర్వానంద్ చేసిన ట్రాన్స్‌ఫర్మేషన్ ఇప్పుడు టాలీవుడ్‌లో హాట్ టాపిక్‌గా మారింది. ఫస్ట్ లుక్ విడుదలైనప్పటి నుంచే ఆయన లుక్ ప్రేక్షకులను ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే, తాజాగా విడుదలైన ట్రాన్స్‌ఫర్మేషన్ వీడియో ఈ మార్పు వెనుక ఉన్న కఠినమైన ప్రయాణాన్ని స్పష్టంగా అందరికీ తెలిసేలా చేసింది. ఈ సినిమాలో బైకర్ పాత్రను రియలిస్టిక్‌గా చూపించాలన్న లక్ష్యంతో శర్వా పూర్తిగా తన శరీరాన్ని మలచుకున్నారు. ట్రైనింగ్ లో భాగంగా శర్వా రోజుకు 32 కిలోమీటర్లు పరుగెత్తడం లాంటి ఎక్స్‌ట్రీమ్ కార్డియో వర్కౌట్స్ చేయడమనేది మామూలు విషయం కాదు. క్రమశిక్షణతో చేసిన ఈ ప్రయాణంలో ఆయన 6 నుంచి 8 కిలోల వరకు బరువు తగ్గి, లీన్ మరియు యూత్‌ఫుల్ ఫిజిక్‌ను సాధించారు. ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ కేవలం లుక్ కోసమే కాకుండా, పాత్రకు న్యాయం చేయాలనే పట్టుదలతో జరిగిందిగా కనిపిస్తోంది. అయితే, ఈ మార్పు వెనుక ఉన్న అసలు కారణం డెడికేషన్‌దే. కఠినమైన వర్కౌట్స్, నిరంతర శ్రమ, మానసిక ఒత్తిడి.. వీటన్నింటినీ ఎదుర్కొంటూ శర్వా తన టార్గెట్ ను సాధించారు. ఈ ప్రయాణాన్ని ఆయన స్వయంగా ఎగ్జాస్టింగ్, పెయిన్‌ఫుల్, రిలెంట్‌లెస్ గా అభివర్ణించడం, ఈ ప్రిపరేషన్ ఎంత తీవ్రంగా సాగిందో చెబుతోంది. ఫిజికల్‌గా మాత్రమే కాదు, మెంటల్‌గా కూడా ఈ ట్రాన్స్‌ఫర్మేషన్ ఒక పెద్ద ఛాలెంజ్‌గా నిలిచింది. ఫిట్‌నెస్ పరంగా చూస్తే, ఆయన రొటీన్ చాలా కఠినంగా ఉంది. జిమ్‌లో స్ట్రెంగ్త్ ట్రైనింగ్, వెయిట్ లిఫ్టింగ్‌తో పాటూ స్ట్రెచింగ్, బ్రీత్‌వర్క్‌లను కూడా పాటించారు. ముఖ్యంగా యోగా ఆయనకు మానసిక ప్రశాంతత ఇచ్చిన కీలక అంశంగా మారింది. కఠినమైన ట్రైనింగ్ వల్ల వచ్చే మెంటల్ స్ట్రెయిన్‌ను తగ్గించడంలో యోగా ముఖ్య పాత్ర పోషించిందని ఆయన చెప్పడం, ఫిట్‌నెస్‌లో మైండ్- బాడీ బ్యాలెన్స్ ఎంత ముఖ్యమో తెలియజేస్తుంది. బిహైండ్ ది సీన్స్ యాంగిల్ లో చూస్తే, ఈ ప్రాజెక్ట్ కోసం చేసిన ప్రిపరేషన్ మరింత ఆసక్తికరంగా ఉంటుంది. ట్రాన్స్‌ఫర్మేషన్ వీడియోలో కనిపించిన ట్రైనింగ్ సెషన్స్, బైక్ రైడింగ్ ప్రాక్టీస్ ఇవన్నీ చూస్తుంటే శర్వా ఈ సినిమా కోసం ఎంత కష్టపడ్డారనేది తెలుస్తోంది. సినిమాలో ఉపయోగించే బైక్స్‌ను నడిపేందుకు స్పెషల్ గా ట్రైనింగ్ తీసుకోవడం ద్వారా, ఆయన పాత్రను మరింత సహజంగా తీర్చిదిద్దారు. ఇది కేవలం ఫిజికల్ ట్రాన్స్‌ఫర్మేషన్ మాత్రమే కాకుండా ఒక యాక్టర్ కమిట్‌మెంట్ కు ఎగ్జాంపుల్ గా నిలుస్తోంది. పట్టుదల, క్రమశిక్షణ ఉంటే అసాధ్యం అనేది ఏదీ లేదని శర్వా చూపించారు. కాగా బైకర్ సినిమా ఏప్రిల్ 3న విడుదల కానుండగా, ఇప్పటికే ఈ మూవీపై మంచి బజ్ నెలకొంది. మరి శర్వా ఈ సినిమా కోసం పడ్డ కష్టం ఏ మేరకు ఫలిస్తుందనేది చూడాలి.



స్టైలిష్ కో-ఆర్డ్ ఫోటోషూట్‌లో కావ్య థాపర్ గ్లామర్‌ను ప్రసరిస్తుంది





జిన్నీ వెడ్స్ సన్నీ 2ని ప్రమోట్ చేస్తున్నప్పుడు మేధా శంకర్ గ్రీన్ లెహంగాలో స్టన్స్ చేసింది

Printed By Published By Gantyada Apparao On Behalf Of Gantyada Apparao, Printed At Sri Sai Ganga Printers And Publications D.No: 49-1-35, Miriyalapalem Center, Railway Station Road, Prakasam, Andhra Pradesh - 523001 And Published At published at D. No. 41-1/5-1, Srinivasa Tower, Flat No. S2, Gowthami Nagar, Krishnalanka, Vijayawada, NTR Dist. editor GANTYADA APPARAO. PRGI Registration No. " APTEL/25/A4561" e-mail :editorpenpower@gmail.com, Mobile: 9059465965